www.epaper.samayamdaily.net APTEL/2006/18267
సమయం
తెలుగు దినపత్రిక

# సంపాదకీయం

## తెలంగాణ రాజకీయ చరిత్రపై చెరగని సంతకం

తలంగాణ తొలి దశ ఉద్యమ సారథి.. రెండు సార్లు ముఖ్యమంత్రి పదవి.. సుదీర్ఘ కాలం పాటు గవర్నర్ బాధ్యతలు.. చిన్న వయసులోనే మంత్రి హోదా... ఆయనే డాక్టర్ మర్రి చెన్నారెడ్డి. ఆంధ్రప్రదేశ్ రాజకీయాలపై చెన్నారెడ్డి వేసిన ముద్ర చాలా ప్రభావవంతమైనది. రాజకీయ దురంధరుడిగా.. పాలనాదక్షుడుగా ఆయన నడిచిన బాట అనితర సాధ్యం. తెలంగాణ రాష్ట్ర సాధనకు కారణభూతుడు కూడా ఆయనే. 1969 ఉద్యమాన్ని పతాక స్థాయికి చేర్చి.. మలిదశ ఉద్యమానికి మార్గం సుగమం చేశారు డాక్టర్ చెన్నారెడ్డి. 1971 లోక్‌సభ ఎన్నికల్లో తెలంగాణ ప్రజా సమితి (టీపీఎస్) అఖండ విజయం సాధించినప్పటికీ, సీపీఐ నేత ఎస్ఏ డాంగే సలహాతో ఇందిరాగాంధీ రాష్ట్ర ఏర్పాటుకు నిరాకరించారని చెబుతారు. కొన్ని రక్షణలను హామీగా పొందడంతో సరిపెట్టుకొని, చెన్నారెడ్డి టీపీఎస్‌ను కాంగ్రెస్‌లో విలీనం చేశారు. చెన్నారెడ్డి, 'తెలంగాణ అభిమాని, నిర్ద్వంద్వంగా తెలంగాణవాది.' చెన్నారెడ్డి మాటలు ఎంతో ప్రేరణాత్మకంగా, ఆసక్తికరంగా, ఉల్లాసంగా ఉండేవని ఆయనను కలిసిన వారు..ఆయన గురించి తెలిసిన వారు చెబుతారు. రాజకీయాలలో ఎదుగుతున్న, ఎదగాలనుకున్న యువ నాయకులకు చెన్నారెడ్డి జీవితం గొప్ప పాఠ్యగ్రంథం. ఆయనకు వున్న రాజకీయ పరిజ్ఞానం, నేతృత్వ లక్షణాలు, సంక్షోభ నిర్వహణలో నైపుణ్యత, క్లిష్టమైన రాజకీయ పరిస్థితుల్లో వ్యూహాత్మకంగా వ్యవహరించే తీరు ఇతరులలో అరుదుగా కనిపిస్తుంది. 1950లో ప్రొవిజనల్ పార్లమెంట్‌కు నామినేట్ కావడం, కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ విప్‌గా నియమితులవడం కాక ముందు, చెన్నారెడ్డి మూడు సంవత్సరాలు వైద్యవృత్తిలో వున్నారు. చిన్ననాటి నుంచి డాక్టర్ కావాలని కలగన్న చెన్నారెడ్డి తన 22వ ఏట ఎంబీబీఎస్ పట్టా తీసుకోవడం ద్వారా ఆయన కల నెరవేర్చుకున్నారు. ఆ తర్వాత వరంగల్ గాంధీ ఆస్పత్రిలో ప్రభుత్వ డాక్టర్ గా నియమితులయ్యారు. ఉద్యోగంలో చేరిన రెండు నెలల్లోనే రాజీనామా చేసి హైదరాబాద్ లో సొంతంగా రెండు హాస్పిటళ్లు ఏర్పాటు చేసి వైద్యం చేయడం మొదలుపెట్టారు. రెండేండ్ల తర్వాత ఆ రెండు హాస్పిటళ్లను మూసివేసి, తన జీవితాన్ని దేశ రాజకీయాలకు అంకితం చేశారు. 30 సంవత్సరాలు పీసీసీ వర్కింగ్ కమిటీ సభ్యునిగా ఉన్నారు. పార్లమెంటులో హైదరాబాద్ లోని విషమ పరిస్థితులను గురించి చెన్నారెడ్డి చేసిన ప్రసంగాలు నెహ్రూ, రాజాజీ వంటి వారిని ఆకర్షించాయి. దీంతో చెన్నారెడ్డి కాంగ్రెస్ పార్టీ విప్ గా ఎన్నికయ్యారు. 1952లో, హైదరాబాద్ రాష్ట్ర అసెంబ్లీకి ఎన్నికై, బూర్గుల రామకృష్ణారావు ప్రభుత్వంలో మంత్రిగా పనిచేశారు. 1967 సాధారణ ఎన్నికల తరువాత, ఇందిరాగాంధీ కేంద్ర కేబినెట్‌లో చేరమని సూచించినప్పటికీ, ముఖ్యమంత్రిగా కొనసాగడానికే మొగ్గుచూపిన బ్రహ్మానందరెడ్డి తనకు బదులుగా చెన్నారెడ్డి పేరును ప్రతిపాదించారు. ముల్కీ ఉద్యమాన్ని నడిపేందుకు 'తెలంగాణ ప్రజా సమితి' (టీపీఎస్)ను స్థాపించిన ఏ.మదన్‌మోహన్, తన అధ్యక్ష స్థానాన్ని చెన్నారెడ్డికి అప్పగించారు. ఇది చెన్నారెడ్డి నేతృత్వ సామర్థ్యాలను, నాయకత్వ పటిమను ప్రజలు తెలుసుకోవడానికి, తరువాత జరిగిన 1971 లోక్‌సభ, 1978 అసెంబ్లీ, 1980 లోక్‌సభ, 1989 లోక్‌సభ అసెంబ్లీ ఎన్నికలలో 'భారీ విజయాలు' సాధించడానికి మార్గం సుగమం చేసింది. ఈ విజయాల వల్ల చెన్నారెడ్డి 'అద్భుతమైన నాయకత్వ నైపుణ్యం' ఉన్న వ్యక్తిగా నిరూపితమయ్యారు. ఎన్టీఆర్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ, జైలు భరో కార్యక్రమం అద్భుతంగా ఆయన నిర్వహించడంతో రాష్ట్ర కాంగ్రెస్‌ను ఉత్తేజపరిచాయి. 1989 అసెంబ్లీ ఎన్నికలలో కాంగ్రెస్ 294 సీట్లలో 181 సీట్లు గెలుచుకుంది. డాక్టర్ చెన్నారెడ్డి రెండవ సారి ముఖ్యమంత్రి అయ్యారు. డాక్టర్ మర్రి చెన్నారెడ్డి వంటి వ్యక్తులు రాజకీయాల్లోకి రావడం తెలంగాణ ప్రజల భాగ్యం. తెలంగాణ ఉద్యమానికి ఆయన దిశానిర్దేశర, నాయకత్వ నైపుణ్యం, ప్రజలతో సన్నిహితంగా మమేకం కావడం వంటి ప్రత్యేకతలు ఆయనను అసాధారణ నేతగా నిలిపాయి. రాజకీయ చతురతతోనూ, ప్రగతిశీల ఆలోచనలతోనూ, అత్యున్నత ప్రజాసేవా దృక్పథంతోనూ ఆయన తన సేవలు అందించారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో ఆయన పాత్ర అపూర్వం, అపురూపం. దీనిపై రెండో మాట లేదు. వర్తమాన తెలంగాణ విజయగాథలో చెన్నారెడ్డి స్ఫూర్తి ప్రతిబింబిస్తున్నది. ఆయన విలువలు, ఆలోచనల నుంచి మనం ఎన్నో, ఎన్నెన్నో పాఠాలు నేర్చుకోవాలి. మర్రి చెన్నారెడ్డి లేకుండా తెలంగాణ ఉండేది కాదు. అందుకే ఆయన చిర స్మరణీయులు. తెలంగాణ రాజకీయ చరిత్రలో చెరగని సంతకం. (డిసెంబర్ 2- మర్రి చెన్నారెడ్డి వర్ధంతి)

## వాజేడు ఎస్ఐ హరీశ్ ఆత్మహత్య

**ములుగు, డిసెంబర్ 02 (సమయం న్యూస్):**

ములుగు జిల్లా వాజేడు ఎస్ఐ హరీశ్ ఆత్మహత్య చేసుకున్నారు. ముళ్లకట్ట సమీపంలోని హరిత రిసార్ట్సులో తన సర్వీస్ రివాల్వర్‌తో కాల్చుకుని బలవన్మరణానికి పాల్పడ్డారు. వ్యక్తిగత కారణాలతో ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలుస్తున్నది. అయితే ఏటూరునాగారంలో ఎన్‌కౌంటర్ జరిగిన రాత్రే ఆయన సూసైడ్ చేసుకోవడంతో పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఘటనా స్థలానికి చేరుకున్న ఉన్నత అధికారులు దర్యాప్తు చేపట్టారు. ఏటూరునాగారం మండలం చెల్పాక-ఐలాపూర్ అటవీ ప్రాంతంలో ఆదివారం తెల్లవారుజామున భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. మావోయిస్టులు, పోలీసులకు మధ్య భీకరపోరు కొనసాగింది. ఇరువర్గాల మధ్య హోరాహోరీగా జరిగిన ఎదురుకాల్పుల్లో ఏడుగురు మావోయిస్టులు మృతిచెందారు. ఇందులో ఒకరు మహిళా మావోయిస్టు ఉన్నారు. రెండు ఏకే 47 తుపాకులతోపాటు మరో ఐదు ఆయుధాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మృతుల్లో ఆరుగురు ఛత్తీస్‌గఢ్‌కు చెందిన వారు కాగా, తెలంగాణలోని పెద్దపల్లి జిల్లా పాలకుర్తి మండలం రాణాపూర్ గ్రామానికి చెందిన ఏగోలపు మల్లయ్య ఉన్నారు. తెల్లవారుజామున 4 నుంచి 5 గంటల సమయంలో ఈ ఎన్‌కౌంటర్ జరిగినట్టు సమీప గ్రామాల ప్రజలు చెప్తున్నారు. చెల్పాక పంచాయతీ పరిధిలోని పోలుకమ్మ వాగు గొత్తికోయగూడేనికి ఆరు కిలోమీటర్ల దూరంలో ఉన్న దట్టమైన అటవీ ప్రాంతం పుల్లలమెద తోగు సమీపంలో ఈ ఎన్‌కౌంటర్ జరిగింది. ఘటనా స్థలాన్ని జిల్లా ఎస్పీ శబరీశ్ పరిశీలించారు. మృతుల్లో నర్సంపేట-ఇల్లందు ఏరియా దళ కమాండర్ కుర్సం మంగు అలియాస్ భద్రు అలియాస్ పాపన్న (35), డివిజన్ కమిటీ సభ్యుడు ఏగోలోపు మల్లయ్య అలియాస్ కోటి (43), ఏరియా కమిటీ సభ్యురాలు ముసకి జమున (23), ఏరియా కమిటీ సభ్యుడు కరుణాకర్ (22) ఉన్నట్టు ములుగు జిల్లా ఎస్పీ శబరీశ్ వెల్లడించారు. మిగిలిన వారిని గుర్తించాల్సి ఉన్నదని చెప్పారు. పీఎల్‌జీఏ వారోత్సవాలకు ఒకరోజు ముందు మావోయిస్టు పార్టీకి తెలంగాణలో భారీ దెబ్బ కోలుకోలేని దెబ్బతగిలింది.




## బీజేపీ నుంచి షిండే, అజిత్‌ల ఎగ్జిట్ ఎన్నడు?

మహారాష్ట్ర అసెంబ్లీలో మొత్తం స్థానాలు 288. కనీస మెజారిటీ 145. ప్రస్తుతం బీజేపీకి సొంతంగా 132 మంది ఎమ్మెల్యేల బలం ఉంది. శివసేన (షిండే) పార్టీ తరఫున గెలిచిన వారి సంఖ్య 57. ఎన్సీపీ (అజిత్) పార్టీ తరఫున 41 మంది గెలిచారు. ప్రస్తుతం బీజేపీ ఫార్ములా ప్రకారం.. సీఎం సీటు బీజేపీ నేతకు, షిండే, అజిత్ లకు డిప్యూటీ సీఎం పదవులు అని అంటున్నారు. మొన్నటి వరకూ షిండేకు డిప్యూటీగా ఉన్న దేవేంద్ర ఫడ్నవీస్ సీఎం అవటం దాదాపు ఖాయమైంది. గతంలో తను సీఎంగా వ్యవహరించినప్పటికీ ఫడ్నవీస్ అవసరార్థం ఆ తర్వాత షిండేకు డిప్యూటీగా చేశాడు కాబట్టి, ఇప్పుడు షిండే ఆయనకు డిప్యూటీగా చేయడంలో పెద్ద ఘోరం ఏమీ లేదనేది బీజేపీ థియరీ. ఇక రెండవ డిప్యూటీ సీఎం పాత్రను అజిత్ పవార్ మరోసారి పోషిస్తాడు. అజిత్‌కు ఈ సర్దుమాటు సరే.. కానీ షిండే లోనే అసంతృప్తి ఉంది. మోడీ, షాలు ఏది చెబితే అది అని అంటున్నారాయన. కానీ శివసేనను చీల్చుకొచ్చినప్పుడు తనను సీఎంగా చేశారు కాబట్టి, ఇప్పుడు కూడా తననే సీఎంగా చేయాలనే డిమాండ్ ఆయన వైపు నుంచి వినిపించింది. ఇలాంటి డిమాండ్ చేసినందుకే కదా.. ఉద్ధవ్ ఠాక్రేని బీజేపీ దెబ్బతీసిన విషయం షిండేకు తెలియనిది కాదు!

రాజీ పడటం మినహా షిండేకు మరో మార్గం లేదు. ఆయన ఆ మాత్రం లౌక్యం తెలియనివాడూ కాదు. అయితే సీఎం హోదాలో ఉన్నప్పుడే షిండే పలు సార్లు అలిగాడు. తనను సీఎంగా కూర్చోబెట్టి మొత్తం బీజేపీ వాళ్లు ఆడుకుంటున్నారనే ఆక్రోశం ఆయనలో గతంలోనూ ధ్వనించింది. ఒక దశలో ఆయన అలిగి వెళ్లిపోయారనే ప్రచారమూ జరిగింది. సీఎంగా తను ఉండగా.. కేబినెట్ గురించి అయినా, మరో విషయంలో అయినా డిప్యూటీ సీఎం ఢిల్లీకి వెళ్లి చర్చించి రావడం గురించి షిండే నొచ్చుకున్నారు! అయితే అప్పుడు అలా నొచ్చుకున్నా పెద్ద మార్పేం కనిపించలేదు. గత్యంతరం లేక బీజేపీతోనే షిండే ఎన్నికలకు వెళ్లారు. మరి ఇప్పుడు ఆయన కొత్తగా

చేయగలిగింది ఏమీ లేదనే చెప్పాలి. ఐతే, షిండే డిప్యూటీ సీఎం తీసుకోకపోవడమే మంచిదని. కావాలంటే కేంద్ర మంత్రి పదవి, లేదా ఈ కూటమి కన్వీనర్ వంటి పదవి తీసుకుంటే మంచిదని అనేది ఆయన సన్నిహితుల సలహా. అయితే ఏ హోదాలో ఉన్నా, షిండే కు పెద్దగా ప్రాధాన్యత ఉండదనేది మాత్రం నిజం. బీజేపీ తన అవసరార్థమే షిండేకు సీఎం సీటు ఇచ్చింది. అయినా ఇప్పుడు ప్రతీకారం అయితే గట్టిగానే ఉండొచ్చు. బీజేపీ కోరిక మేరకే షిండే శివసేనను చీల్చు కొచ్చారు. బీజేపీతోనే కలిసి సాగుతున్నారు. అయినా షిండేకు చుక్కలు కనిపించడం ఖాయం. పైగా ఇలాంటివి బీజేపీకీ అలవాటైనవే. కాబట్టి తన వద్ద 57 మంది ఎమ్మెల్యేలు ఉన్నారని షిండే మురిసిపోవాల్సిందేమీ లేదు! వారిలోంచి మరో షిండేను పుట్టించాల్సిన అవసరం కూడా ఇప్పుడు బీజేపీ లేదు. గంప గుత్తగా శివసేనను బీజేపీ లో విలీనం చేసేసుకున్నా అరిచి గగ్గోలు పెట్టే నాథుడు లేడు! బీజేపీ అనుకుంటే.. ఈ విలీనం రోజుల వ్యవధిలో పూర్తవుతుంది. షిండే ఒక్కడూ అప్పుడు గగ్గోలు పెట్టినా పట్టించుకునే వారు ఉండరు. అప్పుడు ఉద్ధవ్ కు నువ్వు నామాలు పెడితే, ఇప్పుడు నీకు బీజేపీ నామాలు పెట్టిందనే మాటే సర్వత్రా వినిపిస్తుంది.


ఇక అజిత్ పవార్ సంగతి సరే సరి. ఆయనకు పెద్దగా ఆశలు లేవు. కేసులు, ఇబ్బందులు లేకపోతే చాలు. మంత్రి పదవి, డిప్యూటీ సీఎం.. హోదాల గురించి పట్టించుకునే పరిస్థితి ఉండదు గతంలో తాము తీవ్ర అవినీతి పరుడుగా చెప్పిన అజిత్ కు బీజేపీ ఎప్పుడో మంచివాడనే సర్టిఫికేట్ ఇచ్చింది. కాబట్టి.. బీజేపీ ప్రాపకంలో అజిత్ బ్యాలెన్స్ రాజకీయ జీవితం కొనసాగవచ్చు! అది ఆయన అదృష్టం. కానీ, అజిత్ ను బీజేపీ వదిలించుకోవాలనే డిమాండ్ కమలం పార్టీలోని ఒక వర్గం నుంచి వినిపిస్తూ ఉంది. అవసరానికి తీసుకున్నారు సరే, ఇప్పుడు అతడి అవసరం లేదని, ఇక శంకరగిరి మాన్యాలు పట్టించాలని ఈ వర్గం వాదిస్తూ ఉంది. కాబట్టి.. అజిత్ వీలైనంతా సాగిలా పడటమే మిగలవచ్చు!

ఏదేమైనా, మహారాష్ట్ర రాజకీయాల్లో షిండే, అజిత్ పేర్లు ఇక వీలైనంత తక్కువగా, వీలైనంత చిన్నగా వినిపిస్తాయి. వచ్చే ఎన్నికల నాటికి వీరిని రాజకీయ చిత్రం నుంచి వీరి ప్రాధాన్యత తగ్గుతుంది. అసలు వీరొకరు ఉన్నారనే విషయాన్ని ప్రజలు, పరిశీలకులు కూడా పట్టించుకోని పరిస్థితి రావచ్చు.



## రేవంత్ రెడ్డి ఏడాది పాలన!


తెలంగాణ రెండవ ముఖ్యమంత్రిగా ఎనుముల రేవంత్ రెడ్డి ఏడాది పదవీకాలాన్ని పూర్తిచేసుకుంటున్నారు. అనేక ప్రచారాలు, ఒత్తిళ్ల మధ్య కాంగ్రెస్ పార్టీ నుంచి ఒక ఏడాది పాటు ముఖ్యమంత్రిగా బాధ్యతలను పూర్తిచేయడమనేది పెద్ద విషయమే. అయితే ఈ ఏడాదిలో ఆయన ఏం సాధించారో చూడటం కూడా అవసరమే. వై ఎస్ రాజశేఖర్ రెడ్డి లా రేవంత్ రెడ్డి జీన్స్ లో కాంగ్రెస్ రక్తమున్న నాయకుడు కూడా కాదు. భారతీయ జనతా పార్టీ మూలాలతో, తెలుగుదేశం పార్టీ శిక్షణలో రాటుదేలి ఎదిగిన నాయకుడు! అలాంటి రేవంత్ రెడ్డి కొన్ని తరాలుగా కాంగ్రెసు పార్టీనే నమ్ముకుని ఉన్న నాయకులందరినీ బైపాస్ చేసి ముఖ్యమంత్రి పీఠాన్ని అధిష్ఠించగలిగారంటే.. అది కేవలం ఆయన కష్టార్జితం. శ్రమ ఫలం. రేవంత్ రెడ్డి దూకుడు, కష్టనష్టాలకు వెరవని తత్వం ఇవన్నీ కలిపి ఆయనను రేసులో ముందంజలో ఉంచి ముఖ్యమంత్రి అయ్యేలా చేశాయి. సీఎం పదవికి తాను ఎంపిక కావడానికి దారి తీసిన కారణాలు, పార్టీ అధిష్ఠానాన్ని ఇంప్రెస్ చేసిన అర్హతలు ఏవైనా కావొచ్చు గాక.. ఎన్నయినా ఉండవచ్చు గాక.. పదవిలో కలకాలం కొనసాగడానికి అవి చాలవు అనే సంగతి రేవంత్ కు చాలా బాగా తెలుసు. అందుకే సీఎం అయ్యేదాకా ఒక తీరు .. అయిన తర్వాత మరో తీరు అన్నట్టుగా ఆయన తన పనితీరును నిర్దేశిరచుకున్నారు. 'ఆరు గ్యారంటీలు' అనే జనాకర్షక హామీలతో కాంగ్రెస్ ను అధికారంలోకి తీసుకువచ్చిన రేవంత్ రెడ్డి.. పగ్గాలు చేపట్టిన వెంటనే రెండింటిని నెరవేర్చారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించారు. ఆరోగ్య శ్రీ బీమా లిమిట్ ను పది లక్షల రూపాయలకు పెంచారు. సర్వత్రా జనామోదం పొందిన నిర్ణయాలు అవి. ముఖ్యమంత్రి పదవిలోకి వచ్చిన తర్వాత తీసుకుంటున్న నిర్ణయాలు, అనుసరిస్తున్న విధానాలు, దూకుడు విషయంలో సహచరులు నోరెత్తలేక మౌనంగా ఉండి పోయే పరిస్థితిని సృష్టించాలని రేవంత్ రెడ్డి ముందుగానే ఒక స్థిరాభిప్రాయానికి వచ్చినట్లుగా కనిపిస్తోంది. ఆయన పనితీరు దానికి తగ్గట్టుగానే ఉంది.దానికి తగ్గట్లుగానే ఆయన పని చేసుకుంటూ పోతున్నారు. పార్టీలో సీనియర్ సహచరులలో అసంతృప్తి రాకుండా తనకు చేతనైన చర్యలు తీసుకుంటున్నారు. డిప్యూటీ ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కను ఎన్నికల ఫలితాల సమయంలోనే డిప్యూటీ ముఖ్యమంత్రిగా కూర్చుండబెట్టారు. అప్పటి వరకు ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు నివాసం గా ఉన్న భవంతిని, తన జమానాలో డిప్యూటీ అయిన భట్టికి కేటాయించారు. అంతేకాదు, అన్ని ప్రభుత్వ కార్యక్రమాలలో ముఖ్యమంత్రితో సమానంగా భట్టివిక్రమార్కకు ప్రాధాన్యం ఇస్తూ వచ్చారు. చివరికి ప్రభుత్వ కార్యాలయాల్లో ఏర్పాటు చేసే ఫోటోల విషయంలో కూడా ముఖ్యమంత్రితో సమానంగా భట్టి విక్రమార్క ఫోటోలు కూడా పెట్టిస్తూ ఆయనను సంతృప్తి పరిచారు. పరిపాలన పరంగా తన ముద్ర చూపించుకోవడం లక్ష్యంగా, తాను మాత్రమే చేయగలిగిన శైలి పనులు ఇవి అనిపించేంత దూకుడుగా ఆయన నిర్ణయాలు తీసుకోవడం ప్రారంభించారు. తెలంగాణ చరిత్రలోనే హైడ్రా కూల్చివేతలు ప్రత్యేక అధ్యాయం! నీటి వనరులను, సరస్సులు, కాలువలను కాపాడడానికి చాలా మొండి ధైర్యంతో హైడ్రా ఆలోచనకు రేవంత్ రూపకల్పన చేశారని చెప్పాలి. అన్ని రకాలుగానూ.. ఇంతటి వైభవోపేతమైన భాగ్యనగరం.. వర్షాకాలంలో దుర్భర జీవితానికి ఆలవాలం అవుతున్నదంటే.. నీటివనరులు శాశ్వత దురాక్రమణలకు గురై ఉండడమే అనే కఠోరసత్యాన్ని సీరియస్ గా పట్టించుకున్న ఏకైక ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి. నీటి వనరుల ఆక్రమణల విషయంలో ఎంతటి వారి ఆస్తులైనా సరే, ఎంత విలువైన నిర్మాణాలు అయినా సరే.. వెనక్కు తగ్గేది లేదని.. సమూలంగా నేలమట్టం చేసేయడమే అని ఆయన పలు సందర్భాల్లో నిరూపించుకుని ముందుకు సాగారు. అలాగని, రేవంత్ రెడ్డి పరిపాలనలో లోపాలు లేవని చెప్పలేం. సకాలంలో రైతుబంధు నిధులు ఇవ్వకపోగా రుణమాఫీ చేస్తానని ప్రకటించిన హామీ ఇవాళ్టి దాకా పూర్తి స్థాయిలో అమలు కాలేదు. హైడ్రా కూల్చివేతల విషయంలో చిన్న చిన్న అవాంతరాలు ఎదురవుతూనే ఉన్నాయి. మూసీ నది ప్రక్షాళన విషయంలో పేదల ఇళ్లు కూల్చి వేయడం అనేది పెద్ద రాద్ధాంతంగా మారిపోయింది. మూసీ నదిని ప్రక్షాళన చేయడం ఆ ప్రాంతం మొత్తానికి పూర్వవైభవం తీసుకురావడం అనేది అతి పెద్ద బృహత్కార్యం. ఇలాంటి కార్యాన్ని తలపెట్టినప్పుడు అవాంతరాలు రావడం సహజం. రాజకీయ అభ్యంతరాలను పట్టించుకోకుండా ప్రజలకు మంచి చేస్తున్నానా లేదా, అలాగే తన నిర్ణయం వలన ఎన్ని పేద కుటుంబాలు పూర్తిగా ఛిద్రమవుతాయి అందుకు తన ప్రభుత్వం చూపగలిగిన పరిష్కారం ఏమిటి? ఇలాంటి అంశాలను కూడా పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుంది. పేదలకు ఎలాంటి అన్యాయం జరగకుండా వారి ఉపాధులు ఏమాత్రం దెబ్బ తినకుండా వారు అదనపు ఇబ్బందులు పడకుండా తన ఆత్మ సాక్షికి తెలిసేలాగా పరిష్కారాలను చూపగలి గారా లేదా అనేది ముఖ్యం. ఆ విషయంలో రేవంత్ రెడ్డి ఇంకా పూర్తిగా దృష్టి సారించినట్లుగా అనిపించడం లేదు. మరోవైపు, సీఎం మార్పు బూచీనా చూపిస్తే రేవంత్ రెడ్డి ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీయడానికి, ఆయనలో ఒకరకమైన భయాన్ని రేకెత్తించడానికి ప్రతిపక్షాలు తమ శక్తివంచన లేకుండా పనిచేస్తూనే ఉన్నాయి. కేటీఆర్, కిషన్ రెడ్డి వంటి విపక్ష నాయకులు ఇప్పటికి కొన్ని వందల సార్లు.. రేవంత్ రెడ్డి పదవి త్వరలోనే పోతుందని చెబుతూ వచ్చారు. కానీ వారి అలాంటి మైండ్ గేమ్ కు రేవంత్ ఏ మాత్రం లొంగలేదు. మరింత దూకుడుగా, మరింత ఆత్మవిశ్వాసంతో, మరింత ఘనంగా అడుగులు వేస్తున్నారు. అవినీతి మరకలు తనకు అంటకుండా చూసుకుంటున్నారు. ఎక్కడ నెగ్గాలో కాదు.. ఎక్కడ తగ్గాలో తెలియడం గొప్ప అనే సిద్ధాంతాన్ని ఆయన కూడా పాటిస్తున్నారు. ప్రజాందోళనల్ని ఆయన గౌరవిస్తున్నారు. ఒక రాజకీయ నాయకుడికి ఇది చాలా ముఖ్యమైన లక్షణంగా ఉండాలి. చాలా మంది ప్రజాందోళనల్ని గుర్తించకుండా, గౌరవించకుండా.. తమ భవిష్యత్తును తామే నాశనం చేసుకుంటూ ఉంటారు. రేవంత్ రెడ్డి అలాంటి తప్పులు అంతగా చేయడం లేదు. ఒక పార్టీ అధికారంలోకి వస్తే.. తొలి ఏడాదిలోనే మేనిఫెస్టో మొత్తం పూర్తిచేసేస్తుందని, చేసేయాలని ఎవ్వరూ ఆశించరు. కానీ హామీల గురించి ప్రతిపక్షాలు ప్రతినిత్యం గోలచేస్తూనే ఉన్నాయి. రేవంత్ అన్ని హామీలకు డెడ్ లైన్ల సహా ఒక కార్యచరణ ప్రణాళిక ప్రకటిస్తే.. ప్రతిపక్షాల నోర్లకు తాళాలు పడతాయి. ఆయన ఇలాంటి జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంది.



## కానిస్టేబుల్ హత్య కేసులో.. కొత్త ట్విస్ట్

**ఇబ్రహీంపట్నం, డిసెంబర్ 02 (సమయం న్యూస్):**

కానిస్టేబుల్ నాగమణి హత్యలో కొత్త విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. తొలుత పరువు హత్య అనుకున్నప్పటికీ కారణాలు వేరే ఉన్నాయని తెలుస్తున్నది. హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న నాగమణి సోమవారం ఉదయం హత్యకు గురయ్యారు. ఇది పరువు హత్య అని తొలుత భావించినప్పటికీ పోలీసుల విచారణలో ఆస్తి గొడవలే కారణమని తెలుస్తున్నది. రాయపోల్‌కు చెందిన నాగమణి గత నెల 1న.. అదే గ్రామానికి చెందిన శ్రీకాంత్‌ను యాదగిరిగుట్టలో కులాంతర వివాహం చేసుకున్నది. అనంతరం వారు హయత్‌నగర్‌లో నివాసం ఉంటున్నారు.



ఆదివారం సెలవు కావడంతో నాగమణి తన సొంత గ్రామానికి వెళ్లారు. అయితే సోమవారం ఉదయం స్కూటీపై డ్యూటీకి వస్తుండగా.. కారులో వెంబడించిన తమ్ముడు పరమేష్ ఆమెను ఢీకొట్టాడు. అనంతరం కొడవలితో మెడ నరికి చంపాడు. దీంతో అతడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు.. విచారిస్తున్నారు. ఈ క్రమంలో ఆస్తి కోసమే చంపినట్లు ప్రాథమిక విచారణలో తేలింది. నాగమణికి తల్లిదండ్రులు లేకపోవడంతో పరమేశ్ అన్నీ తానే చూసుకున్నాడు. కాగా ఆమెకు ఇదివరకే వివాహమై విడాకుల కూడా అయ్యాయి. దీంతో తమ వారసత్వంగా వచ్చిన భూమిని మొదటి వివాహం తర్వాత తమ్ముడికి ఇచ్చేసింది. అయితే రెండో పెండ్లి చేసుకున్న తర్వాత.. ఆ భూమిలో వాటా ఇవ్వాలని గత కొంతకాలంగా తమ్ముడిపై ఒత్తిడి చేస్తున్నట్లు తెలుస్తున్నది. దీంతో అక్కపై కోపంతో ఉన్న పరమేశ్ ఆమెను హత్యచేశాడు.

# రాజ్యాంగంపై చర్చకు పార్లమెంట్ రెడీ

**ఫ్లోర్ లీడర్లతో లోక్‌సభ స్పీకర్ సమావేశం**
**నేటి నుంచి యథావిధిగా పార్లమెంటు సమావేశాలు**

**న్యూఢిల్లీ, డిసెంబర్ 2 (సమయం న్యూస్) :**

పార్లమెంటు శీతాకాల సమావేశాలు ప్రారంభమైనప్పటికీ విపక్షాల ఆందోళనలతో ఉభయ సభల కార్యకలాపాలకు అంతరాయం కలుగుతోంది. పలు అంశాలపై చర్చ జరపాలన్న విషయంపై కేంద్రం, విపక్షాల మధ్య నెలకొన్న ప్రతిష్టంభనకు ఎట్టకేలకు తెరపడింది. ముఖ్యంగా రాజ్యాంగం ఆమోదం పొంది 75 ఏళ్లు పూర్తైన నేపథ్యంలో ఈ నెల 13, 14వ తేదీల్లో లోక్‌సభలో, 16, 17వ తేదీల్లో రాజ్యసభలో చర్చించేందుకు తేదీలు ఖరారు చేసినట్లు పార్లమెంటరీ వ్యవహారాలశాఖ మంత్రి కిరణ్ రిజిజు తెలిపారు. మంగళవారం నుంచి ఉభయసభలు సజావుగా సాగేలా విపక్షాలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. పార్లమెంట్‌లో అదానీ వ్యవహారం, మణిపుర్ పరిస్థితి, సంభాల్ ఘటన వంటి అంశాలపై చర్చ జరపాలని విపక్షాల డిమాండ్ చేశాయి. ఈ మేరకు లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా అధ్యక్షతన జరిగిన అఖిలపక్ష సమావేశంలో విపక్షాలు లేవనెత్తిన పలు అంశాలను చర్చించేందుకు ప్రభుత్వం సానుకూలంగా స్పందించడం వల్ల కేంద్రం, విపక్షాల మధ్య నెలకొన్న ప్రతిష్టంభనకు తెరపడింది. ముఖ్యంగా లోక్‌సభలో సంభాల్ అంశం, బంగ్లాదేశ్ పరిస్థితులపై చర్చించేందుకు ప్రభుత్వం సుముఖత వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. . ఈ సమావేశంపై పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు స్పందించారు. పార్లమెంటు ప్రతిష్టంభనపై కేంద్రం, విపక్షాలు ఏకాభిప్రాయానికి వచ్చాయని... రేపటి నుంచి ఉభయ సభలు సజావుగా నడుస్తాయని ఆశిస్తున్నామని చెప్పారు. అంతేకాకుండా... పార్లమెంటు ఉభయ సభల్లో రాజ్యాంగంపై చర్చ జరగనుందని వెల్లడించారు. లోక్ సభలో డిసెంబరు 13, 14 తేదీల్లో... రాజ్యసభలో డిసెంబరు 16, 17 తేదీల్లో భారత రాజ్యాంగంపై చర్చ చేపడుతున్నట్లు కిరణ్ రిజిజు వివరించారు. రాజ్యాంగంపై మొదట లోక్ సభలో చర్చించాలన్న నిర్ణయానికి అందరూ ఆమోదం తెలిపారని పేర్కొన్నారు. ఏదైనా అంశాన్ని లేవనెత్తాలనుకుంటే నోటీసు ఇవ్వడం ద్వారా మాట్లాడొచ్చని, అంతే తప్ప సభలో గందరగోళం సృష్టించే ప్రయత్నం మంచిది కాదని స్పీకర్ చెప్పారని వెల్లడించారు. స్పీకర్ ప్రతిపాదనకు అందరూ సమ్మతించారని తెలిపారు.

## చేవెళ్ల మండలం ఆలూరు గేటు దగ్గర జరిగిన రోడ్డు ప్రమాదం అత్యంత బాధాకరం

**చేవెళ్ల, డిసెంబర్ 2 (సమయం న్యూస్) :**

నేను ఇవాళ సాయంత్రము పార్లమెంట్ లో ఉన్నప్పుడు ఈ దుర్ఘటనలో గురించి తెలిసింది. తీవ్ర ఆందోళనకు లోనయ్యాను. ఇప్పటివరకు నలుగురు ప్రాణాలు కోల్పోయినారు అని, పది మందికి పైగా తీవ్రమైన గాయాలు అయ్యాయని నాతో చెప్పారు. హైదరాబాద్ వైపు నుంచి చేవెళ్ల వైపు పోతున్న లారీ డ్రైవర్ మద్యం మత్తులో వేగంగా వెళ్తూ అదుపు తప్పి ఆలూరు గేటు మీద కూరగాయాలు అమ్ముకునే వారి మీదకు లారీని నడిపిండు అని స్థానికులు చెప్తున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. నిన్న కూడా ఖానాపూర్ గేటు దగ్గర జరిగిన రోడ్డు ప్రమాదంలో ప్రొద్దుటూరు గ్రామానికి చెందిన భార్య భర్తలు చనిపోయారు. వారి కుమారుడితో ఫోన్ లో మాట్లాడి ధైర్యం చెప్పిన. అంతకు ముందు మొయినాబాద్ లో బైక్ మీద వెళ్తున్న యువకులకు ప్రమాదం జరిగింది. ఒకదాని తర్వాత ఒకటి ప్రమాదాలు జరగడం అత్యంత విచారం. మృతుల కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతిని తెలుపుతున్నాను. నేను రేపు ఢిల్లీ నుంచి తిరిగి వస్తాను, భారతీయ జనతా పార్టీ నాయకులు, కార్యకర్తలు భాధిత కుటుంబాలకు అందుబాటులో ఉండి ధైర్యాన్ని ఇవ్వాలని కోరుతున్నాను. దాదాపు ఎనిమిది సంవత్సరాలు అయినా కూడా మన్నెగూడ వరకు రోడ్డు పనులు పూర్తి కాకపోవడంతో దురదృష్టం, మొన్న నవంబర్ 18 నాడు హైదరాబాద్ లో ఉన్నప్పుడు జాతీయ రహదారుల అధికారులతో రోడ్డు పనుల ఆలస్యం మీద సమీక్ష నిర్వహించాను, పనులు మొదలు అవుతాయని హామీ ఇచ్చారు, ఇంతలోపే ఇటువంటి దారుణ సంఘటనలు జరగడం బాధాకరం. ఇవాళ రోడ్డు ప్రమాదంలో చనిపోయిన వారి కుటుంబాలకు ధైర్యం చెపుతున్నాను.

## సిటీలో బీఎంఎస్ స్ట్రాంగ్ అవుతుంది

**రైల్వే యూనియన్ ఎన్నికల్లో విజయం మాదే**
**ఎంఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తూర్పు రాంరెడ్డి**



**హైదరాబాద్, డిసెంబర్ 2 (సమయం న్యూస్) :**

తెలుగు ప్రభ):గ్రేటర్ పరిధిలోని జీహెచ్ఎంసీ కార్మికులు, ఉద్యోగుల సమస్యల పరిష్కారం, వారి ప్రయోజనాల పరిరక్షణకు క్రియాశీలకంగా పని చేస్తున్న భాగ్యనగర్ మున్సిపల్ జీహెచ్ఎంసీ ఎంప్లాయిస్ యూనియన్ కృషితో సిటీలో భారతీయ మజ్దూర్ సంఘ్ మరింత స్ట్రాంగ్ అవుతుందని బీఎంఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తూర్పు రాంరెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ఈ నెల 4,5, 6 తేదీల్లో భారతీయ రైల్వేలోని అన్ని రైల్వే జోన్లలో కార్మిక సంఘాల గుర్తింపు కోసం రహస్య బ్యాలెట్ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో సోమవారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో బీఎంఎస్ నేతలతో ఆయన ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా బీఎంఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తూర్పు రాంరెడ్డి మాట్లాడుతూ రైల్వే యూనియన్ గుర్తింపు ఎన్నికల్లో బీఎంఎస్ దే విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. రైల్వే శాఖలోని ఎస్సీ, ఎస్టీ కార్మిక సంఘాలన్నీ కూడా బీఎంఎస్ కు మద్దతు పలుకుతుందని ఆయన వెల్లడించారు. దేశవ్యాప్తంగా అన్నిరైల్వే జోన్లలో జరగనున్న ఈ ఎన్నికల్లో పోలైన ఓట్లలో 51 శాతం ఓట్లను బీఎంఎస్ గుర్తింపు పొందిన దక్షిణ మధ్య రైల్వే కార్మిక సంఘ్ దక్కించుకుని విజయం సాధించేందుకు తాము వ్యూహం సిద్ధం చేసినట్లు ఆయన తెలిపారు. అన్ని రైల్వే జోన్లలో ఇప్పటి వరకు నిర్వహించిన ప్రచార కార్యక్రమాల్లో విజయం దిశగా దక్షిణ మధ్య రైల్వే కార్మిక సంఘ్ దూసుకెళు తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. బీఎంఎస్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు, భాగ్యనగర్ మున్సిపల్ జీహెచ్ఎంసీ ఎంప్లాయిస్ యూనియన్ జనరల్ సెక్రటరీ టి. కృష్ణ మాట్లాడుతూ రైల్వే యూనియన్ గుర్తింపు ఎన్నికల్లో భాగంగా హైదరాబాద్ పరిధిలోకి వచ్చే అన్ని రైల్వే స్టేషన్ల పరిధిలో దక్షిణ మధ్య రైల్వే కార్మిక సంఘ్ విజయం సాధించేలా తమ వంతు కృషి చేస్తామని స్పష్టం చేశారు. భాగ్యనగర్ మున్సిపల్ జీహెచ్ఎంసీ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులు జి. రాజేశ్వరరావు, వైస్ ప్రెసిడెంట్ దేవేందర్, అడిషనల్ జనరల్ సెక్రటరీ రాధాకృష్ణ, యూనియన్ ఖైరతాబాద్ జోన్ జనరల్ సెక్రటరీ ఆర్. వెంకటేశ్, జీహెచ్ఎంసీ సెక్రటరీ రూపేశ్ కుమార్, ఎల్బీనగర్ జోన్ అధ్యక్షులు ఎం.యాదగిరి, శేరిలింగంపల్లి జోన్ ప్రెసిడెంట్ ఇక్బాల్, ప్రధాన కార్యాలయం ఇన్ ఛార్జి పవన్, సికిందరాబాద్ జోన్ ఇన్ ఛార్జి కామరాజు,యూనియన్ నేతలు రసూల్, రాఘవేందర్ , భరత్ తదితరులు పాల్గొన్నారు.

## మైనారిటీలపై భారత్‌లోనూ దాడులు

**భారత్, బంగ్లాదేశ్ ల మధ్య పెద్ద తేడా లేదు**
**మెహబూబా ముఫ్తీ సంచలన వ్యాఖ్యలు**

**న్యూఢిల్లీ, డిసెంబర్ 2 (సమయం న్యూస్) :**

బంగ్లాదేశ్ లో మైనారిటీ హిందువులపై దాడులు జరుగుతున్నాయి.. అదేవిధంగా భారత్ లోనూ మైనారిటీలపై దాడులు జరిగితే ఇక ఈ రెండు దేశాల మధ్య తేడా ఏమున్నట్టు? అంటూ జమ్మూ కాశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి, పీడీపీ చీఫ్ మెహబూబా ముఫ్తీ సంచలన వ్యాఖ్యలు చేశారు. డిసెంబర్ 024న ఉత్తరప్రదేశ్ లోని సంభాల్ లో జరిగిన హింసను ప్రస్తావిస్తూ ముఫ్తీ ఈ వ్యాఖ్యలు చేశారు. పాలకులు దేశాన్ని 1947 నాటి కాలం వైపు నడిపిస్తున్నారని మండిపడ్డారు. దేశంలో యువతకు ఉద్యోగాలు లేవు, తగినన్ని ఆసుపత్రులు లేవు, సరైన విద్యావకాశాలు లేవని గుర్తుచేశారు. పాడైపోయిన రోడ్లను బాగుచేయాల్సిన పాలకులు ఆ విషయం పక్కన పెట్టి ఆలయాల ఆనవాళ్ల కోసం మసీదులను కూల్చి ఆ శిథిలాల్లో వెతుకుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సంభాల్ తరహాలోనే అజ్మీర్ దర్గాపైనా వివాదం సృష్టించారని, ఆలయ స్థలంలో దర్గాను నిర్మించారని కొంతమంది కోర్టుకెక్కారని చెప్పారు. మతసామరస్యానికి వేదికగా నిలిచే అజ్మీర్ దర్గాలో సర్వే పేరుతో తవ్వకాలకు సిద్ధమవుతున్నారని ముఫ్తీ మండిపడ్డారు. మైనారిటీలపై దాడుల విషయంలో ఇండియాకు, బంగ్లాదేశ్ కు తేడా కనిపించడంలేదని అన్నారు.ఉత్తరప్రదేశ్ సంభాల్ లోని షాహి జామా మసీద్ ఉన్న స్థలంలో గతంలో ఓ ఆలయం ఉండేదని, దానిని కూల్చేసి మసీదును కట్టారని యూపీ కోర్టులో పిటిషన్లు దాఖలయ్యాయి. వీటిని విచారించిన కోర్టు.. మసీదు స్థలంలో సర్వే చేయాలని ఆదేశించింది. కోర్టు ఆదేశాలతో అధికారులు సర్వే చేయడానికి ప్రయత్నించగా స్థానిక ముస్లింలు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా జరిగిన గొడవలో పోలీసులు జరిపిన కాల్పుల్లో నలుగురు చనిపోయారు. దీంతో సంభాల్ ఉద్రిక్తంగా మారింది. ఈ ఘటనను ప్రస్తావిస్తూ మైనారిటీలపై మన దేశంలోనూ దాడులు జరుగుతున్నాయంటూ ముఫ్తీ ఆవేదన వ్యక్తం చేశారు.

## మహిళలు ఏమైనా కుందేళ్లా?

**పిల్లల్ని కంటే ఉద్యోగాలు దొరికే పరిస్థితి కూడా లేదు**
**మోహన్ భగవత్ వ్యాఖ్యలపై రేణుకా చౌదరి ఆగ్రహం**

**హైదరాబాద్,డిసెంబర్2(సమయం న్యూస్):**

వరుసగా పిల్లలను కనడానికి మహిళలు ఏమైనా కుందేళ్లా? అని కాంగ్రెస్ సీనియర్ నేత రేణుకా చౌదరి మండిపడ్డారు. ప్రతి జంట ముగ్గురు పిల్లలను కనాలని ఆరెస్సెస్ సర్ సంఘ్ చాలక్ మోహన్ భగవత్ ఇటీవల పిలుపునిచ్చారు. దేశంలో జనాభా వృద్ధి రేటు తగ్గుదలపై ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఈ వ్యాఖ్యలపై కాంగ్రెస్ మహిళా నేత రేణుకా చౌదరి తీవ్రంగా స్పందించారు. దేశంలో నిరుద్యోగ సమస్య తీవ్రంగా ఉందని, పిల్లల్ని కంటే ఉద్యోగాలు దొరికే పరిస్థితి కూడా లేదన్నారు. ఉద్యోగం లేని అబ్బాయిలకు అమ్మాయిలను ఇచ్చేందుకు ఎవరూ ముందుకు రారన్నారు. మోహన్ భగవత్ ఎక్కువమంది పిల్లలను కనాలని చెబుతున్నాడని, కానీ అలా కనేందుకు మహిళలు కుందేళ్లు కాదన్నారు. ఈ మాటలు చెప్పేవాళ్లు ఎంతమంది పిల్లలను పెంచగలరు? అని ప్రశ్నించారు. అలా మాట్లాడేవారి అనుభవాలు ఏమిటో బాగా తెలుసని వ్యాఖ్యానించారు. దేశంలో పెరుగుతున్న ధరలపై ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. ఎవరైనా అనారోగ్యంతో ఆసుపత్రి పాలైతే చికిత్సకయ్యే ఖర్చు భారీగా ఉంటోందన్నారు.

## మహిళా కానిస్టేబుల్ దారుణ హత్య

**కారుతో ఢీకొట్టి గొంతుకోసి హతమార్చిన తమ్ముడు**
**రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండలంలో ఘటన**
**నెలరోజుల క్రితమే ప్రేమ వివాహం చేసుకున్న నాగమణి**

**హైదరాబాద్,డిసెంబర్2(సమయం న్యూస్):**

రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండలంలో మహిళా కానిస్టేబుల్ నాగమణి హత్యకు గురయ్యారు. రాయపోలు నుంచి ఎండ్లగూడ వెళ్లే రహదారిపై ఈ ఘటన జరిగింది. హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో నాగమణి విధులు నిర్వహిస్తున్నారు. గతంలో ఆమెకు వివాహం జరగ్గా, 10 నెలల క్రితం భర్తతో విడాకులయ్యాయి. అనంతరం నెల రోజుల క్రితం మరో వ్యక్తిని కులాంతర ప్రేమ వివాహం చేసుకున్నారు. ఇది నచ్చని ఆమె సోదరుడు పకడ్బందీగా ప్లాన్ చేసి, డ్యూటీకి వెళు తుండగా కార్‌తో ఢీ కొట్టి, వేట కొడవలితో నరికి హత్య చేశాడని కుటుంబసభ్యులు ఆరోపిస్తున్నారు. ‘8 సంవత్సరాలుగా నేను నాగమణి ప్రేమించుకుంటున్నాం. మా ప్రేమ విషయం తెలిసి ఇంట్లో వాళ్లు నాగమణిని పట్టించుకోవడం మానేశారు. 2021లో ఆమెకు కానిస్టేబుల్ ఉద్యోగం వచ్చింది. అంతకుముందు 4 సంవత్సరాలు తను హాస్టల్?లోనే ఉంది. ఆ సమయంలో నేనే ఆమెకు కావాల్సిన అవసరాలు తీర్చి చదివించాను. కానిస్టేబుల్ జాబ్ వచ్చాక తల్లిదండ్రులు ఆమెకు దగ్గరయ్యారు. నవంబర్ 10వ తేదీన యాదగిరిగుట్టలో మేం పెళ్లి చేసుకున్నాం. పెళ్లి చేసుకున్న వెంటనే మాకు ప్రాణహాని ఉందని పోలీస్ స్టేషన్?లో ఫిర్యాదు చేశాం. మేం పెళ్లి చేసుకున్నప్పటి నుంచి మమ్మల్ని చంపుతామని నాగమణి కుటుంబసభ్యులు బెదిరిస్తూ వచ్చారు. ఈరోజు అనుకున్నట్టే నా భార్యను వాళ్ల తమ్ముడు చంపేశాడు. రాయపోల్ నుంచి హయత్?నగర్ బయలుదేరే ముందు నాకు ఫోన్ చేసింది. మా తమ్ముడు నన్ను చంపేస్తున్నాడు అంటూ ఫోన్ కట్ చేసింది. వెంటనే మా అన్నయ్యకు విషయం చెప్పాను. ఆయన వెళ్లేలోపే రక్తపు మడుగులో నాగమణి కొట్టుకుంటుంది.’ అని నాగమణి భర్త శ్రీకాంత్ వివరించారు.

## సంక్రాంతికి కొత్త రేషన్ కార్డులు

**అర్హులైన వారికి మంజూరు చేస్తామన్న ఏపీ ప్రభుత్వం**

**అమరావతి, డిసెంబర్ 2 (సమయం న్యూస్) :**

తెలుగు ప్రజలకు పెద్ద పండగైన సంక్రాంతికి ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లోని కోట్లాది కుటుంబాల్లో ఆనందోత్సాహాలు వెల్లివిరియనున్నాయి. ఓ వైపు ఆంధ్రప్రదేశ్?లోని కూటమి ప్రభుత్వం సంక్రాంతి పండగకు ప్రజలకు భారీ కానుకను ప్రకటించింది. రాష్ట్రంలోని అర్హులైన వారందరికీ రేషన్? కార్డులు మంజూరు చేస్తామని ప్రకటించడంతో పాటు పాత ? కార్డుల్లో మార్పులు, చేర్పులకు అవకాశం కల్పించింది. ఈ మేరకు డిసెంబర్? 2వ తేదీ నుంచే అప్లికేషన్ల ప్రక్రియ ప్రారంభించింది. అర్హత ఉన్న వారు గ్రామ/వార్డు సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించింది. వివరాలన్నింటిని పరిశీలించిన తర్వాత అర్హత ఉన్న వారికి నూతన కార్డులను మంజూరు చేస్తారని వెల్లడించింది. ఈ మేరకు బడ్జెట్?ను? కూడా విడుదల చేసింది.

## 80 వేల పాయింట్లు దాటిన సెన్సెక్స్

**445 పాయింట్లు లాభపడ్డ సెన్సెక్స్**
**144 పాయింట్లు పెరిగిన నిఫ్టీ**

**న్యూఢిల్లీ, డిసెంబర్ 2 (సమయం న్యూస్) :**

దేశీయ స్టాక్ మార్కెట్లు లాభాల్లో ముగిశాయి. ఈ ఉదయం నష్టాల్లో ప్రారంభమైన మార్కెట్లు... మధ్యాహ్నం తర్వాత మళ్లీ పుంజుకున్నాయి. ఇన్ఫోసిస్, రిలయన్స్ వంటి కంపెనీల షేర్లు మార్కెట్లను ముందుండి నడిపించాయి. సెన్సెక్స్ మరోసారి 80 వేల మార్కును అధిగమించింది. ఈరోజు ట్రేడింగ్ ముగిసే సమయానికి సెన్సెక్స్ 445 పాయింట్లు లాభపడి 80,248కి ఎగబాకింది. నిఫ్టీ 144 పాయింట్లు పెరిగి 24,276 వద్ద స్థిరపడింది. అల్ట్రాటెక్ సిమెంట్ (3.93%), జేఎస్ డబ్ల్యూ స్టీల్ (2.47%), అదానీ పోర్ట్స్ (2.18%), టెక్ మహీంద్రా (1.81%), టైటాన్ (1.73%). ఎన్టీపీసీ (-1.55%), కొటక్ బ్యాంక్ (-0.70%), హిందుస్థాన్ యూనిలీవర్ (-0.69%), ఇండస్ ఇండ్ బ్యాంక్ (-0.60%), పవర్ గ్రిడ్ కార్పొరేషన్ (-0.49%). మరోవైపు కొన్ని రోజులుగా హెచ్చుతగ్గులు చవిచూస్తున్న బంగారం, వెండి ధరలు నిన్న స్వల్పంగా పుంజుకున్నాయి. 24 క్యారెట్ల పుత్తడి ధర పది గ్రాములకు రూ. 630 పెరిగి రూ.78,120కి చేరుకుంది. అదే సమయంలో హైదరాబాద్, విజయవాడలో 24 క్యారెట్ల పది గ్రాముల పసిడి ధరపై రూ.780 పెరిగి రూ. 78,120కి, 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం రేటు రూ.71,610కి చేరింది.మరో వైపు ఢిల్లీలో 24 క్యారెట్ల బంగారం ధర పది గ్రాములకు రూ. 78,270కి చేరుకోగా, 22 క్యారెట్ల పది గ్రాముల బంగారం ధర రూ. 71,770గా నమోదైంది. వెండి కూడా కిలోపై రూ. 2,200 పెరిగింది. హైదరాబాద్, విజయవాడ, చెన్నైలో కిలో వెండి రూ. 1,00,100 ఉండగా.. ఢిల్లీ, ముంబైలలో రూ. 91,600గా ఉంది.

## పోలింగ్‌స్టేషన్‌లో ఓటర్లసంఖ్య పెంపుతో ఇబ్బంది కాదా?’

**ఈసీ వివరణకు సుప్రీం ఆదేశం**

**న్యూఢిల్లీ, డిసెంబర్ 2 (సమయం న్యూస్) :**

ఒక పోలింగ్ స్టేషన్‌కు సంబంధించి గరిష్ఠ ఓటర్ల సంఖ్యను 1,200 నుంచి 1,500 వరకు పెంచాలని ఎలక్షన్ కమిషన్ తీసుకున్న నిర్ణయాన్ని సవాల్ చేస్తూ దాఖలైన ప్రజాహిత వ్యాజ్యం(పిల్) పై సుప్రీంకోర్ట్ విచారణ జరిపింది. ఈ పిల్‌పై ఈసీ తన అభిప్రాయం చెప్పాలని సర్వోన్నత న్యాయస్థానం ఆదేశించింది.భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ సంజయ్ కుమార్ ధర్మాసనం సోమవారం ఈ ప్రజాహిత వ్యాజ్యంపై విచారణ జరిపింది. పోలింగ్ స్టేషన్‌లో గరిష్ఠ ఓటర్ల సంఖ్య పెంచడానికి ఉన్న కారణాన్ని వివరిస్తూ మూడు వారాల్లోగా ఒక అఫిడవిట్ దాఖలు చేయాలని ఎన్నికల సంఘం తరఫున హాజరైన సీనియర్ న్యాయవాది మణిందర్ సింగ్‌ను ఆదేశించింది. గరిష్ఠ ఓటర్ల సంఖ్యను పెంచాలని నిర్ణయించడం ఆందోళనకరమని, ఏ ఓటరు కూడా తన ఓటింగ్ హక్కును కోల్పోకూడదని సుప్రీం స్పష్టం చేసింది. ‘ఒక్కో ఈవీఎం (ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్)లో మొత్తం ఓటర్ల సంఖ్యను పెంచినప్పుడు కచ్చితంగా సదరు నియోజకవర్గంలో ఉన్న రాజకీయ పార్టీలన్నింటినీ ఈసీ సంప్రదిస్తుంది’ అని ఈసీ తరఫున హాజరైన న్యాయవాది మణిందర్ సింగ్ సుప్రీంకోర్ట్‌కు తెలిపారు. నిర్ణీత సమయం దాటినా- అప్పటికే పోలింగ్ కేంద్రానికి వచ్చిన వారికి ఓటు వేసేందుకు ఈసీ అనుమతిస్తుందని స్పష్టం చేశారు.సుప్రీంకోర్ట్ బెంచ్ ఈ పిల్ తరువాతి విచారణను 2025 జనవరి 25కు వాయిదా వేసింది. ఈ తేదీలోపు పిటిషనర్‌కు ఈసీ తన అఫిడవిట్ కాపీని అందజేయాలని స్పష్టం చేసింది.ఎలక్షన్ కమిషన్ ఆగస్ట్ నెలలో దేశవ్యాప్తంగా ఉన్న అన్ని పోలింగ్ స్టేషన్‌లోని ఓటర్ల సంఖ్యను పెంచుతూ 2 ప్రకటనలు జారీ చేసింది. దీనిపై ఇందుప్రకాశ్ సింగ్ సుప్రీంకోర్ట్‌లో ప్రజాహిత వ్యాజ్యం దాఖలు చేశారు. ఈసీ నిర్ణయం ఏకపక్షంగా ఉందని, ఎలాంటి అభిప్రాయ సేకరణ చేయకుండా, డేటాను విశ్లేషించకుండా ఈ నిర్ణయం తీసుకుందని ఆయన ఆరోపించారు.

## ‘ఛలో ఢిల్లీ’కి కదం తొక్కిన రైతులు

**న్యూఢిల్లీ, డిసెంబర్ 2 (సమయం న్యూస్) :**

పంటలకు మద్దతు ధర పెంచాలంటూ పంజాబ్ రైతులు నేడు ‘ఛలో ఢిల్లీ’ కార్యాచరణకు కదం తొక్కారు. అయితే, నోయిడాలోని దళిత్ ప్రేరణ్ స్థల్ వద్ద పంజాబ్ రైతులను పోలీసులు అడ్డుకున్నారు. బారికేడ్లు ఏర్పాటు చేసి వందలాది రైతులు ముందుకు రాకుండా పోలీసులు నిలువరించారు. అయినప్పటికీ బారికేడ్లు తొలగించి ఢిల్లీ వైపు దూసుకెళ్లేందుకు రైతులు ప్రయత్నించారు. రైతుల ఛలో ఢిల్లీ నేపథ్యంలో మూడంచెల భద్రత చర్యలు అమలు చేసిన పోలీసులు... రైతులు ముందుకు సాగకుండా ఆపేశారు. పోలీసులు భారీగా వాటర్ క్యానన్లు, టియర్ గ్యాస్ షెల్స్ సిద్ధంగా ఉంచారు. అదనపు బలగాలను మోహరించి, డ్రోన్లతో నిఘా ఏర్పాటు చేశారు. రైతుల ఆందోళన కారణంగా ఢిల్లీ-నోయిడా రహదారిపై రాకపోకలు నిలిచిపోయాయి.

సమయం

# విచారణ జరిపి చట్టపరంగా న్యాయం చేస్తాం







**ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమానికి 94 ఫిర్యాదులు**

**వృద్దులు, దివ్యాంగుల వద్దకు వెళ్ళి ఫిర్యాదులు స్వీకరించి భరోసా కల్పించిన ...జిల్లా ఎస్పీ**

**ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా స్వీకరించిన ఫిర్యాదుల పై త్వరితగతిన స్పందించి, పరిష్కరించాలని పోలీసు అధికారులను ఆదేశించిన ... జిల్లా ఎస్పీ**

**కర్నూలు, డిసెంబర్ 02 (సమయం న్యూస్):-**

కర్నూల్ కొత్తపేటలోని కర్నూల్ టూ టౌన్ పోలీస్ స్టేషన్ ప్రక్కన ఉన్న ఎస్పీ క్యాంపు కార్యాలయంలో జి. బిందు మాధవ్ ఐపియస్ సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం కు వచ్చిన ప్రజల సమస్యల వినతులను స్వీకరించి ఫిర్యాది దారులతో జిల్లా ఎస్పీ మాట్లాడి వారి యొక్క సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి ఈ రోజు మొత్తం 94 ఫిర్యాదులు వచ్చాయి.

**వచ్చిన ఫిర్యాదుల్లో కొన్ని**

1) బెంగుళూరుకు చెందిన ఒరిజన్ ఇన్ఫోటెక్నాలజీ, కియోస్క్ వంటి కంపెనీలలో సాఫ్ట్ వేర్ ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పి హైదారాబాద్ లో కన్సల్టెన్సీ నిర్వహిస్తున్న ప్రవీణ్ కుమార్, రాకేష్, అశ్విని, కిరణ్ కుమార్ లు కలిసి నన్ను నమ్మించి మోసం చేశారు. నేను డోన్ లో గవర్నమెంట్, వెంకటేశ్వర, వైష్ణవి డిగ్రీ కళాశాలలలో లెక్చరర్ గా పని చేస్తుండడంతో నన్ను నమ్మి నాకు తెలిసిన 25 మంది రూ. 50 లక్షల దాకా ఇచ్చి మోసపోయామని, 2 నెలల పాటు బెంగుళూరులో జీతాలు ఇచ్చి కంపెనీలు తీసివేసి మోసం చేశారని కర్నూలు , ముజఫర్ నగర్ కు చెందిన ప్రసన్నలక్ష్మీ ఫిర్యాదు చేశారు.

2) కొట్టాల (గుడిసె) ను ఆక్రమించుకున్న వారి పై చర్యలు తీసుకోవాలని కర్నూలు మండలం, రేమట గ్రామానికి చెందిన నడిపి సుంకన్న ఫిర్యాదు చేశారు.

3) ఆస్తి మొత్తం తన పేరు మీద రాసి ఇవ్వాలంటూ కుమారుడు శివశంకర్ రెడ్డి మద్యం తాగి వచ్చి ప్రతి రోజు ఇబ్బందులకు గురి చేస్తున్నాడని కోడుమూరు మండలం, పులకుర్తి గ్రామానికి చెందిన విజయ భాస్కర్ రెడ్డి ఫిర్యాదు చేశారు.

4) మాకు చెందిన మిగులు భూమి 2 ఎకరాల 50 సెంట్ల స్థలాన్ని బందువులైన ఈశ్వరయ్య, రాముడు కలిసి ఆక్రమించుకున్నారని న్యాయం చేయాలని కర్నూలు, మండలం, దిన్నేదేవరపాడు గ్రామానికి చెందిన ఎల్లమ్మ ఫిర్యాదు చేశారు.

5) మాకు చెందిన స్థలంలో 2 అడుగుల స్థలాన్ని నడవడానికి లేకుండా మూసి వేసి, పైప్ లైన్ కూడా తీసివేశారని వాటిని ఇప్పించి న్యాయం చేయాలని కల్లూరు మండలం, నాయకల్లు గ్రామానికి చెందిన తిరుపాలు, నాగేంద్రమ్మ దంపతులు ఫిర్యాదు చేశారు.

6) కర్నూలు, వాల్ మార్ట్ ప్రక్కన ఉన్న జగదీష్ షాపింగ్ మాల్ లో ఉన్న శ్రీ బాలజీ ఆయుర్వేదిక్ సెంటర్ కు షాప్ నెం. 215 కు చెందిన గౌతమ్ అనే వ్యక్తి కాళ్ళనొప్పులతో బాధపడుతున్న వృద్దులను లక్ష్యంగా ఎంచుకుని కాళ్ళనొప్పులు నయం చేస్తామని వారిని నమ్మించి , ఆయుర్వేదిక్ మందులు ఇస్తామని చెప్పి డబ్బులు తీసుకొని నకిలీ మందులు ఇచ్చి పలువురిని మోసం చేశాడని కర్నూలు, హౌసింగ్ బోర్డుకు చెందిన దేవ భాస్కర్ రెడ్డి , పలువురు బాధితులు ఫిర్యాదు చేశారు.

7) ఆన్ లైన్ లో ఎలక్ట్రికల్ స్కూటర్ కోనుగోలు చేద్దామని , ఫేస్ బుక్ లో చూసి వెతుకుచుండగా, ఒక బుకింగ్ ఐడితో ఎలక్ట్రికల్ స్కూటర్ రూ. 50 వేలు డిస్కౌంట్ వస్తుందని చెప్పి నమ్మించారు. రూ. 89,500 ట్రాన్స్ఫర్ చేయించుకుని సైబర్ నేరగాళ్ళు మోసం చేశారని రికవరీ చేసి న్యాయం చేయాలని కర్నూలు, ఆదిత్యా నగర్ కు చెందిన చాంద్ భాషా ఫిర్యాదు చేశారు.

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదులన్నింటిపై చట్ట ప్రకారం విచారణ జరిపి, బాధితులకు న్యాయం చేస్తామని, సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని ఈ సంధర్భంగా కర్నూలు జిల్లా ఎస్పీ జి. బిందు మాధవ్ ఐపియస్ హామీ ఇచ్చారు. ఈ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో లీగల్ అడ్వైజర్ మల్లికార్జున రావు, సిఐ శివశంకర్ పాల్గొన్నారు.

# డ్రోన్ స్టార్టప్‌లకు రూ.5లక్షల ప్రోత్సాహకాలు





**ఏపీ డ్రోన్ క్యాపిటల్‌గా అవతరించబోతోంది**

**ఈ రంగంలో అపార అవకాశాలు ఎదురు చూస్తున్నాయి**

**యువత అవకాశాలను అందింపుచ్చుకోవాలి**

**ఏపీ డ్రోన్ కార్పొరేషన్ సీఎండీ కె. దినేష్ కుమార్ పిలుపు**


**అమరావతి, డిసెంబర్ 02 (సమయం న్యూస్):-**

డ్రోన్ రంగంలో స్టార్టప్‌లు పెట్టడానికి ముందుకొచ్చే యువతకు, ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు రాష్ట్ర ప్రభుత్వం రూ.5 లక్షల వరకు ప్రోత్సహకాలు ఇస్తుందని ఈ అవకాశాన్ని యువత అందిపుచ్చుకోవాలని ఏపీ డ్రోన్స్ కార్పొరేషన్ సీఎండీ కె. దినేష్ కుమార్ అన్నారు. సోమవారం విజయవాడలోని ధనేకుల ఇంజినీరింగ్ కళాశాలలో అడ్వాన్స్డ్ అటల్ ఫ్యాకల్టీ డెవలప్మెంట్ ప్రోగ్రామం ఆన్ ఏ డీప్ డైవ్ ఇన్‌టూ అటానమస్ వెహికల్ థియరీ టు ప్రాక్టీస్ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పన్నెండు రోజుల పాటు జరిగే ఈ శిక్షణ కార్యక్రమం ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన విద్యార్థులనుద్దేశించి ప్రసంగించారు. రాబోయే రోజుల్లో డ్రోన్ రంగం ఒక కీలక రంగంగా అభివృద్ధి చెందబతోందన్నారు. మన దేశానికి ఆంధ్రప్రదేశ్ ను డ్రోన్ క్యాపిటల్ గా అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సంకల్పించారు. ఆ దిశగా ఇప్పటికే డ్రోన్ రంగంలో ఏపీ ముందుకు వెళుతోందన్నారు. డ్రోన్ తయారీ, సేవల రంగంలో యువతకు, సాంకేతిక విద్యార్థులకు అపారమైన అవకాశాలున్నాయని, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ఎదురు చూస్తున్నాయని, యువత వాటిని అందిపుచ్చుకోవడానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. డ్రోన్స్ తయారీ రంగంలో పరిశ్రమలు పెట్టడానికి ముందుకొచ్చే వారికి వారి 20 శాతం మేర రాయితీ ఇస్తున్నామని తెలిపారు. ఓర్వకల్లు వద్ద 300 ఎకరాల విస్తీర్ణంలో రాష్ట్ర ప్రభుత్వం ఒక డ్రోన్ హబ్‌ను ఏర్పాటు చేయబోతోందన్నారు. ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా డ్రోన్ రంగంలో, డ్రోన్ల వినియోగంలో అనూహ్యమైన మార్పులు వచ్చాయని, సాంకేతిక రోజూ కొత్త పుంతలు తొక్కుతూ ప్రజలకు సేవలు మరింత చేరువయ్యేలా చూడటంలో డ్రోన్లు కీలకపాత్ర పోషించబోతున్నాయన్నారు. దీంతో ఈ రంగంలో అవకాశాలు కూడా పుష్కలంగా లభించబోతున్నాయని తెలిపారు. సాంకేతిక విద్యా సంస్థలు కూడా డ్రోన్ రంగంలో వస్తున్న అత్యాధునిక సాంకేతిక పరిణామాల గురించి వివరించాలని కోరారు. ఈ దిశగా విద్యార్థులకు డ్రోన్లపైన తర్ఫీదు ఇవ్వడానికి ముందుకొచ్చే విద్యా సంస్థలకు కావాల్సిన సహకారం అందించడానికి రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ఐటీఐ, పాలిటెక్నిక్ లో డ్రోన్లకు సంబంధించి సెంటర్ ఆఫ్ ఎక్స్ లెన్సులు ఏర్పాటు చేస్తున్నామని, అలాగే డ్రోన్ల సాంతకేతిక వినియోగంపై నైపుణ్యాభివృద్ధి కేంద్రాలు కూడా ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. వీటన్నిటినీ యువత, సాంకేతిక విద్యార్థులు, సాంకేతిక విద్యాసంస్థలు ఉపయోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఐఐటీ గౌహతి సెంటర్ ఆఫ్ డ్రోన్ టెక్నాలజీ విభాగాధిపతి డాక్టర్ ప్రదీప్, ధనేకుల ఇంజినీరింగ్ కళాశాల ఛైర్మన్ ధనేకుల రవీంద్రనాథ్ ఠాకూర్, కార్యదర్శి భవానీ ప్రసాద్, ప్రిన్సిపాల్ డాక్టర్ రవి కడియాల తదితరులు పాల్గొన్నారు.

# వైఎస్ జగన్ ఆస్తులపై సీబీఐ, ఈడీలను ఆదేశించిన సుప్రీంకోర్టు

**అమరావతి, డిసెంబర్ 02 (సమయం న్యూస్):**

వైఎస్ జగన్ ఆస్తుల కేసులపై సుప్రీం కోర్టులో విచారణ జరిగింది. జగన్ ఆస్తులు కేసులకు సంబంధించి పూర్తి వివరాలు అందించాలని సీబీఐ, ఈడీలను ఆదేశించింది. ఈ కేసులకు సంబంధించిన పూర్తి వివరాలు రెండు వారాల్లోగా అందించాలని.. కింది కోర్టులో ఉన్న డిశ్చార్జ్ పిటిషన్ల వివరాలు ఇవ్వాలని ధర్మాసనం పేర్కొంది. వీటితో పాటుగా తెలంగాణ హైకోర్టులో ఉన్న పెండింగ్ అప్లికేషన్ల వివరాలు అందించాలని సుప్రీం కోర్టు పేర్కొంది. అలాగే సీబీఐ, ఈడీ కేసుల వివరాలు విడివిడిగా చార్ట్ రూపంలో అందించాలని.. ఈ మేరకు అన్ని వివరాలతో అఫిడవిట్లు రెండు వారాల్లో దాఖలు చేయాలని ఆదేశించింది. వైఎస్ జగన్ ఆస్తుల కేసులపై ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణ రాజు సుప్రీం కోర్టును ఆశ్రయించారు. విచారణ ఆలస్యం అవుతోందని.. కేసు విచారణ మరో రాష్ట్రానికి బదిలీ చేయాలని గతంలో పిటిషన్ దాఖలు చేసిన సంగతి తెలిసిందే. సోమవారం ఈ పిటిషన్‌పై జస్టిస్ అభయ్ ఎస్ ఓకా ధర్మాసనం విచారణ చేయగా.. రోజువారీ పద్ధతిలో విచారణకు ఇప్పటికే ఆదేశాలున్నాయని ఇరుపక్షాల లాయర్లు తెలిపారు. ఈ మేరకు తెలంగాణ హైకోర్టు ఆదేశించినట్లు కోర్టుకు తెలిపారు.



# ముమ్మరంగా పూడికతీత పనులు





**కర్నూలు, డిసెంబర్ 02 (సమయం న్యూస్):-**

నగరవ్యాప్తంగా మురుగు కాలువల్లో పూడికతీత పనులు ముమ్మరం చేయాలని నగరపాలక కమిషనర్ ఎస్.రవీంద్ర బాబు అన్నారు. సోమవారం కృష్ణానగర్, బిర్లాకాపౌండ్, సిల్వర్ జూబ్లీ కళాశాల ప్రాంతాల్లో కమిషనర్ విస్తృతంగా పర్యటించారు. మురుగు కాలువల్లో మురుగునీరు ప్రవాహానికి ఆటంకం లేకుండా పూడికతీత పనులు త్వరితగతిన చేపట్టాలని ఆదేశించారు. పూడికతీత పనులకు ఆటంకం కలిగిస్తున్న పలు కాలనీల్లో కల్వర్టులు, మురుగు కాలువల నిర్మాణానికి ప్రతిపాదనలు తయారు చేయాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డిఈఈ మనోహర్ రెడ్డి, శ్రీనివాసరెడ్డి, ఏఈ మనోహర్, శానిటేషన్ ఇంస్పెక్టర్ అనిల్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ

**పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే**

**అన్నదానం చేస్తున్న భూమా అఖిలప్రియ**



**నంద్యాల/ రుద్రవరం, డిసెంబర్ 02 (సమయం న్యూస్):-**

మండల కేంద్రంలోని భాస్కర నందీశ్వర స్వామి దేవాలయంలో కార్తీక మాస చివరి సోమవారం నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమంలో ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ధ్వజారోహణంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వార్లకు ప్రత్యేక పూజల్లో అర్చకులతో కలిసి పూజలు నిర్వహించారు. అనంతరం కార్తీకమాసకర సోమవారం కావడంతో ఆలయానికి వచ్చిన భక్తాదులకు అన్నదానం చేశారు. టిడిపి మండల కన్వీనర్ ఎల్వీ రంగనాయకులు శెట్టి, టిడిపి సీనియర్ నాయకులు పోలా గురుమూర్తి, ఏరువా కృష్ణమూర్తి,యర్రం ప్రతాపరెడ్డి, అల్లడి చంద్రశేఖర్ యాదవ్, బాలరాజు యాదవ్, ఐటీడీపి వైస్ ప్రసిడెంట్ మొల్క గుర్రప్ప , లక్ష్మీకాంత యాదవ్, కొండబోయిన వెంకటరమణ, సింగతల మధుసూదన్ రెడ్డి, తదితర టిడిపి నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

# అంగన్వాడి కేంద్రంలో అన్నప్రసాన కార్యక్రమం



**పెబ్బేరు, డిసెంబర్ 02 (సమయం న్యూస్):-**

అంగన్వాడి సెంటర్లో అన్న ప్రసాన, కార్యక్రమం చేయడం నిర్వహించారు. సోమవారం రోజు పెబ్బేరు మున్సిపల్ పట్టణంలో నాల్గవ అంగన్వాడి కేంద్రంలో అంగన్వాడి టీచర్ వెంకటేశ్వరమ్మ, అన్నప్రసాన, చేయడం జరిగింది. అనంతరంతల్లులు పిల్లలకు బరువులు ఎత్తులు గుర్తించారు.7-3 సం,06 నెలలు నిండిన పిల్లలకు, బాలామృతం ఎగ్స్ ఇచ్చారు. ఈ కార్యక్రమానికి తల్లులు పిల్లలు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# సుప్రీంకోర్టులో స్వల్ప అగ్నిప్రమాదం

**న్యూఢిల్లీ, డిసెంబర్ 02 (సమయం న్యూస్):**

దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టులో స్వల్ప అగ్నిప్రమాదం సంభవించింది. కోర్టు నంబర్ 11, 12 మధ్య ఉన్న వెయిటింగ్ ఏరియాలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. అనంతరం దట్టమైన పొగ వ్యాపించింది. వెంటనే అప్రమత్తమైన కోర్టు భద్రతా సిబ్బంది.. అగ్నిమాపక శాఖ అధికారుల సాయంతో మంటలను అదుపులోకి తెచ్చారు. ఈ ఘటనలో ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు. షార్ట్ సర్క్యూట్ కారణంగానే మంటలు చెలరేగినట్లు ప్రాథమిక విచారణలో తేలింది. ఈ ఘటనతో 11వ నంబర్ గదిలో జరగాల్సిన బెంచ్ విచారణలను తాత్కాలికంగా రద్దు చేశారు.

# మాట మార్చడంతో సీఎం రేవంత్‌రెడ్డి పీహెచ్‌డీ

**ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఒకలా.. ఇప్పుడు ఒకలా రేవంత్**

**రెండు నాల్కల ఆణిముత్యాల విడుదల**

**రైతుబంధు ఇస్తామని ఎగ్గొట్టాడు : మాజీ మంత్రి హరీశ్‌రావు**

**హైదరాబాద్, డిసెంబర్ 02 (సమయం న్యూస్):**

పూటకో మాట మాట్లాడడం.. మాట మార్చడంలో సీఎం రేవంత్ రెడ్డి పీహెచ్‌డీ పూర్తి చేశారని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు సెటైర్లు వేశారు. రేవంత్ ఏడాది పాలన పూర్తవుతున్న సందర్భంగా రేవంత్ రెండు నాల్కల ఆణిముత్యాలను తెలంగాణ భవన్ వేదికగా హరీశ్‌రావు విడుదల చేశారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. రైతుబంధు, బతుకమ్మ చీరలు, ఎల్ఆర్ఎస్, పోటీ పరీక్షల వాయిదా, కులగణన సర్వే, కూల్చివేతలు, ఏక్ పోలీసు, మద్యం అమ్మకాలు, కాళేశ్వరం ప్రాజెక్టు, సోనియా గాంధీ బలిదేవత, పార్టీ ఫిరాయింపులు, శిలాఫలకాలు, పేపర్ యాడ్స్, మూసీ అభివృద్ధి, అడ్వైజర్లకు కేబినెట్ హోదా, యూట్యూబ్ చానెల్స్, ప్రజాస్వామ్య పునరుద్ధరణ, బూటకపు ఎన్‌కౌంటర్లపై రేవంత్ రెడ్డి మాట్లాడిన డబుల్ స్టాండర్డ్స్‌ను హరీశ్‌రావు వీడియో ఆధారాలతో ప్రజలకు చూపించారు. పై అంశాలపై ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఏం మాట్లాడిండు.. అధికారంలోకి వచ్చాక ఏం మాట్లాడిండు అనే విషయాలను కళ్లకు కట్టినట్లు తెలిపారు హరీశ్‌రావు.

కేసీఆర్ రెండు పంటలకే రైతుబంధు ఇస్తున్నాడు.. మేం అధికారంలోకి వస్తే మూడు పంటలకు రైతుబంధు ఇస్తామన్న రేవంత్ వ్యాఖ్యలను హరీశ్‌రావు గుర్తు చేశారు. ఇక మంచి డిజైన్లతో ప్రతి ఆడబిడ్డకు రెండు చీరలు పంపిణీ చేస్తామన్న విషయాన్ని కూడా గుర్తు చేశారు హరీశ్‌రావు. ఎల్ఆర్ఎస్ విషయంలో రేవంత్ రెడ్డి మాట మార్చిన తీరును కూడా వివరించారు. ప్రభుత్వ ఉద్యోగాలకు సంబంధించి పోటీ పరీక్షల విషయంలో రేవంత్ రెడ్డిది డబుల్ స్టాండ్ కాదు.. ట్రిపుల్ స్టాండ్ అని హరీశ్‌రావు ఎద్దేవా చేశారు. కుల గణన సర్వేపై రేవంత్ రెడ్డి ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఏం మాట్లాడారో విషయాన్ని హరీశ్‌రావు వివరించారు. ఇక కూల్చివేతల విషయానికి వస్తే.. తెలియక, అమాయకంగా కొనుగోలు చేసిన వారి విషయంలో రెగ్యులరైజ్ చేయొచ్చు కదా అని ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మాట్లాడిండు.. అధికారంలోకి వచ్చాక కూల్చివేతలపై రేవంత్ రెడ్డి మాట మార్చారని హరీశ్‌రావు మండిపడ్డారు. అధికారం కోసం ఏక్ పోలీసు.. తర్వాత నో పోలీసు అని రేవంత్ అన్నారు. బెల్ట్ షాపుల వల్ల సంసారాలు నాశనం అవుతున్నాయి. ఇప్పుడేమో పల్లెలు తాగాలి.. ఖజానాలు నిండాలనే ధోరణితో విచ్చలవిడిగా బెల్ట్ షాపులకు అనుమతి ఇస్తున్నారని రేవంత్ అరాచకాలపై హరీశ్‌రావు నిప్పులు చెరిగారు. కాళేశ్వరం ప్రాజెక్టు కట్టడం, కూలిపోవడం జరిగిపోయిందని రేవంత్ వ్యాఖ్యానిస్తే.. కానీ ఆయన మంత్రివర్గంలో ఉన్న కొండా సురేఖ రంగ నాయక సాగర్ ద్వారా నీళ్లు విడుదల చేసిందని హరీశ్‌రావు గుర్తు చేశారు. టీడీపీలో ఉన్నప్పుడు సోనియా గాంధీ బలి దేవత అని అన్నడు. ఇప్పుడేమో సోనియమ్మ మా అమ్మ.. నాలుగు కోట్ల తెలంగాణ బిడ్డలకు కన్నతల్లి అని అంటుండు. పార్టీ ఫిరాయింపులకు పాల్పడిన వారిని రాళ్లతో కొట్టి చంపండి అని ప్రతిపక్షంలో ఉన్నప్పుడు అన్నడు.. ఇప్పుడేమో పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహిస్తున్నడు. శిలాఫలకాలపై కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు అని ఎందుకు రాస్తున్నారు.. తెలంగాణ ముఖ్యమంత్రి అని రాయొచ్చు కదా..? అని ప్రశ్నించాడు. ఇప్పుడేమో ప్రతి శిలాఫలకంపై తన(రేవంత్ రెడ్డి) బొమ్మ వేయించుకుంటున్నాడంటూ హరీశ్‌రావు నిప్పులు చెరిగారు. బీఆర్ఎస్ హయంలో అడ్వైజర్లకు కేబినెట్ హోదా కల్పిస్తే.. ప్రభుత్వ సలహాదారులకు కేబినెట్ హోదాకు వ్యతిరేకంగా కోర్టుల్లో పిటిషన్లు వేసిన రేవంత్ రెడ్డి.. ఇప్పుడేమో కాంగ్రెస్ ప్రభుత్వంలో అదే సలహదారులకు కేబినెట్ హోదా కల్పించారని హరీశ్‌రావు గుర్తు చేశారు.




## మహబూబ్‌నగర్ జిల్లాలో పోలీస్ యాక్ట్

**ఈనెల 30 వరకు అమలు**

**జిల్లా ఎస్పీ డీ. జానకి వెల్లడి**

**మహబూబ్‌నగర్,డిసెంబర్ 02 (సమయం న్యూస్):**



మహబూబ్‌నగర్ జిల్లాలో పోలీసులు ఆంక్షలు విధించింది. శాంతి భద్రతల దృష్ట్యా జిల్లా అంతటా పోలీస్ యాక్ట్ 30ని అమలు చేస్తున్నారు. సోమవారం (డిసెంబర్ 2) నుంచి జనవరి 1 వరకు జిల్లా అంత ఆమలులో ఉండనున్నాయి. ఈ మేరకు జిల్లా ఎస్పీ డీ. జానకి వెల్లడించారు. ముందస్తు అనుమతి లేకుండా జిల్లాలో ఎలాంటి బహిరంగ సమావేశాలు కానీ, ఊరేగింపులు, ధర్నాలు జరుపకూడదని తెలిపారు. నిషేధిత ఆయుధాలైన కత్తులు, చాకులు, కర్రలు, తుపాకులు, పేలుడు పదార్థాలు, నేరాలకు పురిగొల్పే ఎలాంటి ఆయుధాలను వాడకూడదని చెప్పారు. భారీగా జనసమూహాన్ని పోగుచేసే సమావేశాలు, లౌడ్ స్పీకర్లు, డీజేలపై కూడా నిషేధం ఉంటుందన్నారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిని చట్టప్రకారం శిక్షిస్తామని తెలిపారు. స్వేచ్ఛ, ప్రజాస్వామ్యం, ప్రజాపాలన అంటూ గద్దెనెక్కిన కాంగ్రెస్ పార్టీ.. ఇప్పుడు తెలంగాణను నిర్బంధంలోకి నెడుతున్నది. అధికారంలోకి రాగానే ప్రజాభవన్ వద్ద కంచెలు కూల్చి, ఇకపై ఆంక్షలు ఉండవంటూ హడావుడి చేసిన ప్రభుత్వం.. తాజాగా తన అసలు రంగును బయటపెట్టింది. తమ అసమర్థ పాలనను, వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు పోలీసులను నమ్ముకుంటున్నది. రాష్ట్రవ్యాప్తంగా పోలీస్ యాక్ట్‌ను అమలు చేసే దిశగా అడుగులు వేస్తున్నది. అసంబద్ధ నిర్ణయాలతో రాష్ట్రంలోని అన్నివర్గాల ప్రజల సంతోషాలను మింగేసిన కాంగ్రెస్.. ఇప్పుడు ప్రశ్నించే హక్కును కాలరాసేందుకు సిద్ధమైంది. ఇప్పటికే హైదరాబాద్‌లో 144 సెక్షన్ అమలు చేయగా, జిల్లాల్లోనూ పోలీస్ యాక్ట్‌ను విధిస్తున్నది. సంగారెడ్డి జిల్లాలో నవంబర్ మొత్తం పోలీస్ యాక్ట్ అమలు చేశారు. కామారెడ్డి జిల్లాలో గత నెల 7 వరకు పోలీస్ యాక్ట్ అమలులో ఉన్నది. కాంగ్రెస్ ప్రభు త్వం ఇప్పటివరకు అధికారికంగా 13 జిల్లాల్లో పోలీస్ యాక్ట్‌ను అమలు చేయగా, అనధికారికంగా 20కి పైగా జిల్లాల్లో పోలీస్ యాక్ట్ నిబంధనలను అమలు చేస్తున్నారన్న అనుమానాలు ఉన్నాయి.

## డ్యూటీకి వెళ్తూ.. అనంతలోకాలకు..

**రోడ్డు ప్రమాదంలో ఐపీఎస్ అధికారి మృతి**




**న్యూఢిల్లీ, డిసెంబర్ 02 (సమయం న్యూస్):**

శిక్షణ పూర్తి చేసుకొని డ్యూటీలో చేరేందుకు వెళ్తున్న ఓ ఐపీఎస్ ఆఫీసర్‌ని మృత్యువు వెంటాడింది. రోడ్డు ప్రమాదంలో సదరు ఆఫీసర్ ప్రాణాలు కోల్పోయాడు. విధుల్లో చేరాల్సిన అతను విగతజీవిగా మార్చురీలో చేరాడు. ఈ ఘటన కర్ణాటక రాష్ట్రంలో చోటు చేసుకుంది. మధ్యప్రదేశ్‌కు చెందిన హర్ష వర్ధన్ (26) సివిల్స్‌లో మంచి ర్యాంక్ సాధించి ఐపీఎస్ ఎంచుకున్నారు. కర్ణాటక కేడర్‌లో ఐపీఎస్‌కు ఎన్నికైన అతను.. మైసూరులోని కర్ణాటక పోలీస్ అకాడమీలో తన నాలుగు వారాల శిక్షణను పూర్తి చేసుకున్నారు. ఈ క్రమంలో హసన్ జిల్లాలో ప్రొబేషనరీ అసిస్టెంట్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్‌గా అతనికి తొలి పోస్టింగ్ వచ్చింది. సోమవారం డ్యూటీలో రిపోర్ట్ చేయాల్సి ఉంది. దీంతో అతను ఆదివారం రాత్రి అక్కడికి పయనమయ్యారు. ఇంతలో మృత్యువు రోడ్డు ప్రమాదం రూపంలో వెంటాడింది. సోమవారం తెల్లవారుజామున ఆయన ప్రయాణిస్తున్న కారు ప్రమాదానికి గురైంది. కారు టైరు ఒక్కసారిగా పేలింది. అనంతరం అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న ఇంటిని, ఆపక్కనే ఉన్న చెట్టును బలంగా ఢీ కొట్టింది. ఈ ఘటనలో హర్ష వర్ధన్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు అతన్ని హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు. అయితే, ప్రమాద తీవ్రత కారణంగా అతను చికిత్స పొందుతూ ప్రాణాలు కోల్పోయారు. డ్రైవర్ మాత్రం స్వల్ప గాయాలతో బయటపడ్డాడు.

## ఆప్‌లో చేరిన ప్రముఖ ఎడ్యుకేటర్ అవధ్ ఓఝా

**న్యూఢిల్లీ, డిసెంబర్ 02 (సమయం న్యూస్):**

ప్రముఖ ఎడ్యుకేటర్ అవధ్ ఓఝా ఆమ్ ఆద్మీ పార్టీలో చేరారు. పార్టీ కన్వీనర్ అర్వింద్ కేజ్రీవాల్, సీనియర్ నాయకుడు మనీష్ సిసోడియా సమక్షంలో ఓఝా ఆప్ తీర్థం పుచ్చుకున్నారు. అర్వింద్ కేజ్రీవాల్ ఆయనకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఓఝా మీడియాతో మాట్లాడుతూ.. విద్య అనేది కుటుంబానికి, సమాజానికి, దేశానికి ఆత్మ లాంటి మాధ్యమమని అన్నారు. రాజకీయాల్లో చేరి విద్యాభివృద్ధికి కృషి చేసేందుకు తనకు అవకాశం కల్పించిన అర్వింద్ కేజ్రీవాల్‌కు, మనీష్ సిసోడియాకు అవధ్ ఓఝా కృతజ్ఞతలు తెలిపారు. 'ఇవాళ నేను రాజకీయాల్లో అడుగుపెడుతున్న సందర్భంగా మీతో ఒక విషయం స్పష్టం చేయదల్చుకున్నాను. నేను రాజకీయాలు, ఎడ్యుకేషన్‌లో ఏదో ఒకటి మాత్రమే ఎంచుకోవాల్సి వస్తే కచ్చితంగా ఎడ్యుకేషన్‌నే ఎంచుకుంటాను' అని ఓఝా చెప్పారు. రాజకీయాల్లో చేరడం ద్వారా విద్యాభివృద్ధికి కృషి చేయాలని తాను ప్రధాన లక్ష్యంగా పెట్టుకున్నానని ఓఝా తెలిపారు. ఓఝా యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ పరీక్షలు రాసే అభ్యర్థులకు శిక్షణ ఇస్తుంటారు. ఆయన దగ్గర శిక్షణ తీసు కున్న ఎంతో మంది ఉద్యోగార్థులు పెద్దపెద్ద



## కేంద్రం వైఖరికి నిరసనగా మళ్లీ రైతుల పోరుబాట

**న్యూఢిల్లీ, డిసెంబర్ 02 (సమయం న్యూస్):**

కేంద్రం వైఖరికి నిరసనగా రైతులు మళ్లీ పోరుబాట పట్టారు. తమ డిమాండ్ల విషయంలో మోదీ సర్కారు నిర్లక్ష్య వైఖరిని ఎండగట్టేందుకు మరోసారి కదం తొక్కారు. తమ డిమాండ్ల సాధన కోసం నేడు పార్లమెంట్ కాంప్లెక్స్ ముట్టడికి రైతు సంఘాల నేతలు పిలుపునిచ్చిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఇవాళ ఉదయం యూపీ రైతులు నోయిడా నుంచి ఢిల్లీకి మార్చ్ నిర్వహించారు. రైతుల ఆందోళనతో సరిహద్దు వద్ద ఉద్రిక్త పరిస్థితులు తలెత్తాయి. రైతుల పాదయాత్రతో భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. కనీస మద్దతు ధరకు చట్టబద్ధతతో పాటు పలు డిమాండ్లపై రైతులు చాలాకాలంగా ఆందోళన చేస్తున్నా కేంద్రం స్పందించడం లేదు. వారితో చర్చలకు సైతం సుముఖత చూపడం లేదు. దీంతో కేంద్రం నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ రైతుల డిమాండ్ల సాధనకు ఈ నెల 6న దేశ రాజధాని ఢిల్లీకి పాదయాత్ర నిర్వహించాలని పంజాబ్‌కు చెందిన రైతు నేత శర్వణ్ సింగ్ పంధేర్ పిలుపునిచ్చారు. దేశంలోని రైతులందరూ వారివారి నేతలు, సంఘాల ఆధ్వర్యంలో పాదయాత్రగా ఢిల్లీకి కదిలి రావాలని కోరారు. సంయుక్త కిసాన్ మోర్చా (రాజకీయేతర), కిసాన్ మజ్దూర్ మోర్చా (కేఎంఎం) ఆధ్వర్యంలో చేపట్టిన ర్యాలీని భద్రతా దళాలు ఫిబ్రవరి 13న నిలిపివేయడంతో వారు పంజాబ్, హర్యానా సరిహద్దుల్లోని శంభు, ఖనౌరి ప్రాంతాల్లో నిలిచిపోయారని పంధేర్ ఆదివారం మీడియా సమావేశంలో చెప్పారు. శంభు, ఖనౌరిలలో రైతులు 293 రోజుల నుంచి ఆందోళన చేస్తున్నారన్నారు.

## ఆ రూట్లలలో రైళ్ల దారి మళ్లింపు

**అమరావతి, డిసెంబర్ 02 (సమయం న్యూస్):**

గుంతకల్లు రైల్వే డివిజన్‌లోని సిమెంట్ నగర్-కృష్ణమ్మ కోన సెక్షన్‌లో, పాణ్యం స్టేషన్ల దగ్గర డబ్లింగ్ పనులు జరుగుతున్నాయి. ఈ కారణంగా గుంతకల్లు, గుత్తి మీదుగా వెళ్లే నాలుగు రైళ్లను దారి మళ్లించనున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. పూరి-యశ్వంతపూర్ గరీబ్ రథ్ వీక్లీ ఎక్స్‌ప్రెస్ (22883)ను డిసెంబరు 6న.. యశ్వంత్‌పూర్-పూరి (22884)ను డిసెంబరు 7న డోన్ స్టేషన్ మీదుగా కాకుండా నంద్యాల, ఎర్రగుంట్ల, గుత్తి ఫోర్ట్, అనంతపురం మీదుగా మళ్లిస్తున్నట్లు ఓ ప్రకటనలో తెలియజేశారు.డిసెంబరు 4, 11 తేదీల్లో.. హౌరా-యశ్వంతపూర్ వీక్లీ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ (22831) రైలును.. యశ్వంత్‌పూర్-హౌరా రైలు (22832)ను డిసెంబరు 6, 13 తేదీల్లో గుత్తి-డోన్ సెక్షన్ మీదుగా కాకుండా అనంతపురం, గుత్తి ఫోర్ట్, ఎర్రగుంట్ల, నంద్యాల స్టేషన్ల మీదుగా మళ్లించనున్నట్టు రైల్వే అధికారులు ప్రకటనలో తెలిపారు. రైలు ప్రయాణికులు ఈ విషయాన్ని గమనించాలని సూచించారు. మరోవైపు రైల్వే ఏసీ కోచ్‌లో ప్రయాణికుల కోసం ఏర్పాటు చేసే బెడ్‌షీట్లు, పిల్లో కవర్స్, టవల్స్ ను ఏ రోజుకు ఆ రోజే శుభ్రం చేసి అందిస్తామని అధికారులు తెలిపారు. రైల్వే కోచ్‌లో తిరుపతి నుంచి అందిస్తున్న బెడ్ షీట్లతోపాటు పిల్లో కవర్స్, టవల్స్ శుభ్రంగా లేవని, వారం రోజులకు ఒకసారి మార్పు చేస్తున్నారంటూ కొందరు ప్రయాణికులు రైల్వే అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో తిరుపతి స్టేషన్ డైరెక్టర్ సూచనల మేరకు పలువురు అధికారులు తిరుపతిలోని చింతలచేనులో రైల్వేకి చెందిన మెకనైజ్డ్ ల్యాండ్రీని అధికారులు పరిశీలించారు. అక్కడి సిబ్బందికి పలు ఆదేశాలు ఇచ్చారు. సికింద్రాబాద్‌లో రోజుకు 2 టన్నులు, తిరుపతిలో 2.5 టన్నులు, కాకినాడలో 4 టన్నులు, విజయవాడలో 1.5 టన్నులు, కాచిగూడలో 12 టన్నుల కెపాసిటీతో కూడిన లాండ్రీలను ఏర్పాటు చేసినట్లు రైల్వే అధికారులు తెలిపారు. రాబోయే రోజుల్లో సికింద్రాబాద్, కాచిగూడలో 48 టన్నుల కెపాసిటీ లాండ్రీని అందుబాటులోకి తీసుకొస్తామంటున్నారు. అంతేకాదు విజయవాడ, మచిలీపట్నం, నర్సాపూర్, గుంటూరులో 10 టన్నుల కెపాసిటీ లాండ్రీని ఏర్పాటు చేస్తారట.




## ఇండియా కూటమి ఎంపీల కీలక సమావేశం

**తృణమూల్ డుమ్మా**



**న్యూఢిల్లీ, డిసెంబర్ 02 (సమయం న్యూస్):**

పార్లమెంట్ శీతాకాల సమావేశాలను అదానీ అంశం, యూపీలోని సంభల్ హింసాకాండ ఘటనలు కుదిపేస్తున్నాయి. ఈ అంశాలపై చర్చకు విపక్షాలు పట్టుపడుతుండటంతో ఉభయసభల్లో వాయిదాల పర్వం కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో సోమవారం విపక్ష ఇండియా కూటమిలోని పార్టీలకు చెందిన ఎంపీలు సమావేశమయ్యారు. అయితే, ఈ కీ మీటింగ్‌ను కూటమిలో భాగంగా ఉన్న తృణమూల్ కాంగ్రెస్ దాటవేసింది. సోమవారం పార్లమెంట్ సమావేశాలు వాయిదా పడిన అనంతరం.. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఛాంబర్‌లో ఎంపీలంతా సమావేశం అయ్యారు. ఈ సమావేశంలో పలు అంశాలపై చర్చించారు. ఉభయసభల్లో ఎన్డీయే ప్రభుత్వాన్ని ఎదుర్కొనే వ్యూహంపై తీవ్రంగా చర్చలు జరిపినట్లు తెలిసింది. అయితే, ఈ కీ మీటింగ్‌కు తృణమూల్ హాజరుకాకపోవడం చర్చనీయాంశంగా మారింది. ధరల పెరుగుదల, నిరుద్యోగం, నిధుల కొరత, మణిపూర్ అంశం సహా ఆరు కీలక అంశాలను మాత్రమే పార్లమెంట్‌లో లేవనెత్తాలనుకుంటున్నట్లు ఆ పార్టీ (తృణమూల్) వర్గాలు తెలిపాయి. కానీ కాంగ్రెస్ మాత్రం అదానీ వ్యవహారంపై మాత్రమే ఒత్తిడి చేయాలనుకుంటోందని.. దీంతో నేడు ఇండియా కూటమి ఫ్లోర్ లీడర్ల సమావేశానికి హాజరుకావడం లేదని ఆ పార్టీ వర్గాలను ఊటంకిస్తూ జాతీయ మీడియా పేర్కొంది. తమ ప్రధాన అంశాలు ఎజెండాలో లేనప్పుడు సమావేశానికి హాజరు కాబోమని తృణమూల్ నేతలు స్పష్టంగా తెలి పినట్లు సదరు కథనాలు పేర్కొన్నాయి.

## అంతర్జాతీయ క్రికెట్ స్టేడియానికి కర్ణాటక సీఎం శంకుస్థాపన

**బెంగళూరు, డిసెంబర్ 02 (సమయం న్యూస్):**

కర్ణాటక రాష్ట్రంలోని తుమకూరు జిల్లా కేంద్రంలో అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం నిర్మించాలన్న దీర్ఘకాలిక డిమాండ్ ఎట్టకేలకు నెరవేరింది. ఈ మేరకు 'కర్ణాటక ఇండస్ట్రియల్ ఏరియాస్ డెవలప్‌మెంట్ బోర్డు' నుంచి కర్ణాటక స్టేట్ క్రికెట్ అసోషియేషన్‌కు భూకేటాయింపు జరిగింది. స్టేడియం నిర్మాణానికి మొత్తం 41 ఎకరాల భూమిని కేటాయించారు. ఈ నేపథ్యంలో కర్ణాటక సీఎం సిద్ధరామయ్య సోమవారం ఉదయం తుమకూరులో క్రికెట్ స్టేడియం నిర్మాణం కోసం శంకుస్థాపన చేశారు. మొత్తం 41 ఎకరాల్లో నిర్మించనున్న ఈ స్టేడియాన్ని రెండేళ్లలో పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇందుకు మొత్తం రూ.150 కోట్లు వ్యయం కానున్నట్లు అంచనా వేశారు. స్టేడియం పూర్తయితే ఇక్కడ అంతర్జాతీయ క్రికెట్ మ్యాచ్‌లు జరగనున్నాయి.



www.epaper.samayamdaily.net APTEL/2006/18267
సమయం
తెలుగు దినపత్రిక

# అమరావతిలో కీలకమైన ఆస్పత్రి, కాలేజీ ఏర్పాటుకు ముందడుగు

### స్థలాన్ని పరిశీలించిన అధికారులు

**అమరావతి, డిసెంబర్ 02 (సమయం న్యూస్):**

ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో కీలకమైన ఆస్పత్రి, మెడికల్ కాలేజీకి ముందడుగు పడింది. ఏపీ మంత్రివర్గ ఉపసంఘం ఇటీవల అమరావతిలో ఈఎస్ఐ ఆసుపత్రి, మెడికల్ కళాశాల ఏర్పాటుకు 20 ఎకరాల స్థలాన్ని కేటాయిస్తూ ఆమోదం తెలిపింది. ఈ మేరకు నెక్కల్లు సమీపంలో సర్వే నంబరు 20లో ఈ–8 రహదారి పక్కన ఉన్న స్థలాన్ని ఈఎస్ఐ, సీఆర్డీఏ అధికారులు పరిశీలించారు. నేషనల్ హైవేకు అనుసంధానం, రాబోయే రోజుల్లో అభివృద్ధి చేసే విధానం, దగ్గరలో స్థలాలు కేటాయించిన సంస్థల వివరాలను సీఆర్డీఏ అధికారులు ఈఎస్ఐ అధికారులకు వివరించారు. ఈఎస్ఐ ఆస్పత్రికి స్థలం కేటాయించిన ప్రాంతానికి సమీపంలోనే అమరావతి రైల్వే స్టేషన్ నిర్మాణం జరుగుతుందని సీఆర్డీఏ అధికారులు తెలిపారు. భవిష్యత్తులో ఈ ప్రాంతం రాజధాని సెంట్రల్ పాయింట్‌గా ఉంటుందన్నారు. అమరావతిలో ప్రభుత్వం కేటాయించిన స్థలంలో 100 పడకల ఈఎస్ఐ ఆసుపత్రి, వైద్య, నర్సింగ్, ఫార్మసీ కళాశాలలు నిర్మించాల్సి ఉన్నందున.. భవిష్యత్ అవసరాల కోసం మరో 20 ఎకరాలు కేటాయిస్తే బాగుంటుందనే అంశంపైనా చర్చించారు. ఈ స్థలాన్ని పరిశీలించిన వారిలో ఈ బీమా, వైద్య సేవల డైరెక్టర్ వీ ఆంజనేయ, ఈఎస్ఐసీ కార్పొరేషన్ డైరెక్టర్ వేణుగోపాల్, జాయింట్ డైరెక్టర్ జి.జగదీప్ గాంధీ, తహసీల్దారు రవిబాబు, సీఐఎస్ ప్లానింగ్ అధికారి రవితేజలు ఉన్నారు. ఈఎస్ఐకి నాన్ పొల్యూషన్ ఇండస్ట్రియల్ జోన్ పక్కన (బిజినెస్ పార్క్) 20 ఎకరాలను సీఆర్డీఏ కేటాయించింది. కృష్ణాయపాలెం నుంచి నెక్కల్లు వరకు రహదారి పక్కన ఈ ప్రాంతం ఉంది. త్వరలోనే ఆస్పత్రికి నిర్మాణానికి సంబంధించి పనులు ప్రారంభించే అవకాశం ఉంది. కేంద్రం అమరావతిలో 500 పడకల ఈఎస్ఐ సెకండరీ కేర్ ఆసుపత్రితోపాటుగా 150 పడకల సూపర్ స్పెషాలిటీ పడకలతో మెడికల్ కాలేజీ ఏర్పాటుకు ఓకే చెప్పింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఏర్పాటు చేసిన ఈఎస్ఐ సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రి.. విభజన తర్వాత తెలంగాణకు వెళ్లిపోయిన సంగతి తెలిసిందే. ఏపీలో ఈఎస్ఐ ఆస్పత్రి లేకపోవడంతో కేంద్రం ఏర్పాటు చేయాలని నిర్ణయించింది.. ఈ మేరకు అమరావతిలో ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ప్రతిపాదించింది. అమరావతిలో ఏర్పాటు చేయబోయే ఈ ఆస్పత్రి నిర్మాణం, నిర్వహణను ఈఎస్ఐ కార్పొరేషన్‌కే అప్పగిస్తే.. రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి వ్యయం చేయాల్సిన పని ఉండదు. ఒకవేళ రాష్ట్రమే నిర్వహించాలనుకుంటే ఒప్పందం వ్యయంలో 1/8 వంతు భరించాల్సి ఉంటుంది. రాబోయే రోజుల్లో అమరావతికి కనెక్టివిటీ పెరగనుంది. నేషనల్ హైవేలు, రైలు మార్గాలు కూడా అందుబాటులోకి రాబోతున్నాయి. భవిష్యత్తులో ఐటీ కంపెనీలు, విద్యా సంస్థలు, పలు ప్రభుత్వ కార్యాలయాలు, పరిశ్రమలు కూడా వస్తాయి అంటున్నారు. ఆయా సంస్థల్లో ఉపాధి పొందే చిరుద్యోగులు ఈఎస్ఐ పరిధిలోకి వస్తారు.. ఇలా పలు అంశాలను పరిశీలించి రాష్ట్ర స్థాయి ఆసుపత్రిని అమరావతిలో ఏర్పాటు చేయాలని నిర్ణయించారు.

# కేసీఆర్ ఒక మొక్క కాదు.. వేగుచుక్క : కవిత

**హైదరాబాద్, డిసెంబర్ 02 (సమయం న్యూస్):**

తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ మొక్క అని సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించడం హాస్యాస్పదంగా ఉందని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత పేర్కొన్నారు. కేసీఆర్ మొక్క కాదు పీకేయడానికి కేసీఆర్ ఒక వేగుచుక్క అని కొనియాడారు. రేవంత్ రెడ్డి గురువులకే చుక్కలు చూపించి తెలంగాణ సాధించిన శక్తి కేసీఆర్ అని కవిత ప్రశంసించారు. ఎమ్మెల్సీ కవిత నివాసంలో కోరుట్ల నియోజకవర్గ బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో జగిత్యాల జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్ రావు, కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలపై కేసులు పెట్టి వేధిస్తే ఊరుకోబోము. ముఖ్యమంత్రి, మంత్రులు అదే పనిగా తిట్ల పరిపాలన చేస్తున్నారు. కేసీఆర్ పాలనలో నిధులు వరదలయ్యి పారేవి%ా% ఇప్పుడు రాష్ట్రంలో తిట్లు పారుతున్నాయని కవిత విమర్శించారు.

# డివైడర్ నుంచి జంప్ చేసిన కారు

**అహ్మదాబాద్, డిసెంబర్ 02 (సమయం న్యూస్):**

మద్యం మత్తులో ఉన్న డ్రైవర్ నిర్లక్ష్యంగా కారు డ్రైవ్ చేశాడు. ఆటోను తప్పించబోయి వేగంగా డివైడర్‌ను ఢీకొట్టాడు. దీంతో గాల్లోకి లేచిన ఆ కారు అవతల రోడ్డులోకి జంప్ చేసింది. ఎదురుగా వస్తున్న స్కూటర్‌ను ఢీకొట్టింది. దానిపై వెళ్తున్న ఇద్దరు వ్యక్తులు అక్కడికక్కడే చనిపోయారు. గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో ఈ సంఘటన జరిగింది. ఆదివారం అర్ధరాత్రి వేళ నరోడా–దేహ్‌గామ్ రోడ్డులో హ్యుందాయ్ క్రెటా కారు వేగంగా ప్రయాణించింది. ముందున్న ఆటోను ఓవర్ టేక్ చేసేందుకు కారు డ్రైవర్ ప్రయత్నించాడు. కాగా, ఆ కారు అదుపుతప్పింది. డివైడర్ పైనుంచి దూకి అవతల రోడ్డులోకి వెళ్లింది. కొన్ని సెకన్లు గాలిలో ఉన్న ఆ కారు ఎదురుగా వస్తున్న స్కూటర్‌ను ఢీకొట్టింది. దానిపై ప్రయాణించిన ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడి మరణించారు. మరోవైపు ఇది చూసి స్థానికులు షాక్ అయ్యారు. వెంటనే కారు వద్దకు వెళ్లారు. కారును ర్యాష్‌గా డ్రైవ్ చేసిన డ్రైవర్ గోపాల్ పటేల్‌ను పట్టుకుని కొట్టారు. ఈ ప్రమాదం గురించి తెలిసి అక్కడకు చేరుకున్న పోలీసులకు అతడ్ని అప్పగించారు. కాగా, కారు డ్రైవర్ గోపాల్ మద్యం మత్తులో ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. అతడ్ని అరెస్ట్ చేశారు. పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతులను 26 ఏళ్ల అమిత్ రాథోడ్, 27 ఏళ్ల విశాల్ రాథోడ్‌గా గుర్తించారు. మరోవైపు ఆ ప్రాంతంలోని సీసీటీవీలో రికార్డైన ఈ సంఘటనకు సంబంధించిన వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది.



# విశాఖపట్నంలో సరికొత్త దందా

### పార్శిల్ పేరుతో గంజాయి సరఫరా

**అమరావతి, డిసెంబర్ 02 (సమయం న్యూస్):**

విశాఖపట్నంలో మరో సరికొత్త దందా బయటపడింది. కొన్ని ముఠాలు పోలీసుల కళ్లుగప్పి గంజాయిని ఇతర రాష్ట్రాలకు తరలించేందుకు కొత్త మార్గాలను వెతుక్కుంటున్నారు. తాజాగా నగరంలో డ్రైఫ్రూట్స్ మాటున సాగుతున్న గంజాయి అక్రమ రవాణాకు బ్రేకులు వేశారు. ప్రముఖ కొరియర్ సంస్థ ద్వారా గంజాయి రవాణా చేస్తున్న ముఠా గుట్టును విశాఖపట్నం రైల్వే పోలీసులు బయటపెట్టారు. విశాఖ నుంచి ఢిల్లీకి 16 కిలోల గంజాయిని రవాణా చేస్తుండగా వికాశ్‌కుమార్ అనే వ్యక్తి రైల్వే పోలీసులు పట్టుకున్నారు. అతడ్ని ప్రశ్నించగా కీలక విషయాలు తెలిశాయి. వికాశ్ కుమార్ కుమార్ అతి తెలివితో గంజాయిని ఎవరికీ అనుమానం రాకుండా ప్యాక్ చేసి, ఆన్‌లైన్‌లో హోం సర్వీస్ పికప్ బుక్ చేస్తున్నాడు. కొరియర్ సంస్థలు ఒకవేళ ప్యాకింగ్‌లో ఏముందని అడిగితే.. డ్రైఫ్రూట్స్ అని చెబుతుండటంతో నిజమేనని నమ్మి వారు బుక్ చేస్తున్నారు. కొద్దిరోజులుగా గుట్టుగా ఈ వ్యవహారం నడుస్తోంది. విశాఖపట్నం నుంచి పలు ప్రాంతాలకు గంజాయి రవాణా చేసినట్లు పోలీసులు గుర్తించారు. ఈ గంజాయి అక్రమ రవాణా వెనుక ముఠా ఉన్నట్లు తెలుసుకుని దర్యాప్తు ముమ్మరం చేశారు. వికాశ్ కుమార్‌ను పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. అలాగే రైల్వేస్టేషన్‌లో చేపట్టిన తనిఖీల్లో మరో ఇద్దరిని పోలీసులు అరెస్ట్ చేశారు. కేరళకు చెందిన మహ్మద్ నాదిర్‌షా దగ్గర 8 కిలోలు, బిహార్‌కు చెందిన నితీష్‌కుమార్ దగ్గర 6 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితులను కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు. కొంతకాలంగా గంజాయిని రైళ్లలో తరలిస్తున్నారు. వీరు సాధారణ ప్రయాణికుల్లో లగేజి బ్యాగులతో యాత్రలకు కుటుంబ సభ్యులతో ప్రయాణిస్తున్నట్లు నమ్మిస్తున్నారు. విశాఖపట్నం నుంచి ఇతర రాష్ట్రాలకు గంజాయి తరలించేందుకు ముఠాలు రైలు మార్గాన్ని ఎంచుకోవటానికి చాలా కారణాల ఉన్నాయి. తక్కువ ఖర్చుతో పాటుగా ఎక్కువ మందిలో నిందితులను పోలీసులు గుర్తించడం కష్టంగా ఉంటుంది. రైలు మార్గంలో అయితే తప్పించుకోవడానికి ఎక్కువ అవకాశాలు ఉన్నాయి. ఈ ముఠాలు రైలు ఎక్కిన తర్వాత కూడా చాలా తెలివిగా వ్యవహరిస్తాయి. ఆ బ్యాగులను వారున్న చోట కాకుండా తలుపు పక్కన, మరుగుదొడ్లు, సీట్ల కింద ఉంచుతారు, ఇంకొందరు ఒక బోగీలో ఉంచి మరో బోగీలో ప్రయాణిస్తారు. ఎప్పటికప్పుడు ఈ బ్యాగుల్ని గమనిస్తూనే ఉంటారు. పోలీసులు కూడా రైల్వే స్టేషన్‌లలో తనిఖీలను ముమ్మరం చేశారు.



# తెలంగాణ అంటే మొదటిగా గుర్తొది కేసీఆరే : హరీశ్‌రావు

**హైదరాబాద్,డిసెంబర్ 02 (సమయం న్యూస్):**



తెలంగాణ అంటే అందరికీ గుర్తొచ్చే పేరు కేసీఆర్.. టీఆర్ఎస్ అంటే గుర్తొచ్చే పేరు కేసీఆర్.. కానీ తెలంగాణ భవన్ అంటే అందరికీ గుర్తొచ్చే పేరు ప్రొఫెసర్ శ్రీనివాస్ రెడ్డి పేరు అని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు పేర్కొన్నారు. మాజీ ఎమ్మెల్సీ శ్రీనివాస్ రెడ్డికి తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన ఆత్మీయ వీడ్కోలు సమావేశంలో హరీశ్‌రావు పాల్గొని ప్రసంగించారు. తెలంగాణ భవన్‌లో ఎవరున్నా లేకపోయినా.. శ్రీనివాస్ రెడ్డి ప్రతి రోజు ఉదయం 9 నుంచి సాయంత్రం 6 దాకా ఉండి పోయేవారు. జల దృశ్యం కావొచ్చు.. తెలంగాణ భవన్ కావొచ్చు.. ఎక్కడైనా సమయపాలన కచ్చితంగా పాటించేవారు. జలదృశ్యం టు తెలంగాణ భవన్..ఇదీ శ్రీనివాస్ రెడ్డి ప్రస్థానం అని హరీశ్‌రావు ప్రశంసించారు. చాలా మందికి రాజకీయాల్లోకి రావాలని ఉంటుంది. ఇలా వచ్చే వారిలో ఒక్కొక్కరికి కొన్ని లక్ష్యాలు ఉంటాయి. ఆ మాదిరిగానే శ్రీనివాస్ రెడ్డి తెలంగాణ రావాలనే ఆకాంక్షతో టీఆర్ఎస్ పార్టీలో చేరారు. జలదృశ్యంలో పార్టీ పెట్టాక మూడో రోజు శ్రీనివాస్ రెడ్డి, రామ్మోహన్ రెడ్డి కలిసి కేసీఆర్‌ను పరిచయం చేసుకున్నారు. 1999లో వెటర్నరీ ప్రొఫెసర్‌గా రిటైర్ అయ్యాను. 1969లో తెలంగాణ కోసం పోరాడి జైలుకు వెళ్లాను అని శ్రీనివాస్ రెడ్డి కేసీఆర్‌కు చెప్పారు. అప్పుడే బాగా కమిట్‌మెంట్ ఉన్న వ్యక్తి అని రామ్మోహన్ రెడ్డి కేసీఆర్‌తో అన్నారు. ఆ నిమిషం నుంచే ఆఫీసు సెక్రటరీగా మారిపోయారు శ్రీనివాస్ రెడ్డి. పార్టీతో ఇవాళ్టి వరకు 25 ఏండ్ల ప్రస్థానం శీనన్నది. ఆయనంటే అందరికీ గౌరవం. ఆయన ముఖంలో కోపం గానీ, తక్కువ చేసి మాట్లాడడం కానీ, పరుషపదజాలం కానీ ఆయన నోట ఎప్పుడూ వినలేదు. 25 ఏండ్లలో ప్రేమ, చిరునవ్వు, ఓపిక, మంచినతం చూశాను తప్ప కోపం చూడలేదు అని హరీశ్‌రావు తెలిపారు. వెటర్నరీ కాలేజీ విద్యార్థి నాయకుడిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు శ్రీనివాస్ రెడ్డి. చెన్నారెడ్డి నాయకత్వంలో ఉద్యమం చేసి జైలుకు వెళ్లారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడాలనే బలమైన ఆకాంక్షలో ఉండే కాబట్టి కేసీఆర్ నాయకత్వంలో పని చేశారు. శ్రీనివాస్ రెడ్డి అంటే ట్రిపుల్ డీ.. డిటర్మినేషన్, డెడికేషన్, డీవోషన్. తెలంగాణ రాష్ట్రం ఏర్పడాలనే డిటర్మినేషన్, బాధ్యతగా, నీతిగా, నిజాయితీగా పని చేయాలనే డెడికేషన్, కేసీఆర్ పట్ల దైవంగా పని చేయాలనే డీవోషన్ శ్రీనివాస్ రెడ్డిలో ఉన్నాయి. కేసీఆర్ ఈజ్ రైట్.. మై బాస్ అనే డివోషన్‌తో ఉండేవారు శ్రీనివాస్ రెడ్డి అని హరీశ్‌రావు పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటులో కేసీఆర్ కష్టాలను ప్రత్యక్షంగా చూసిన వ్యక్తి శ్రీనివాస్ రెడ్డి. కేసీఆర్ పోరాటం, ఆమరణ నిరాహార దీక్షను దగ్గరుండి చూశారు. 2001 నుంచి ఒడిదొడుకులు, రాష్ట్ర సాధనలో వ్యూహాలు, కృషి, జేఏసీ ఏర్పాటుకు సాక్ష్యం కాబట్టి.. ఒక పుస్తకం రాయాలని శ్రీనివాస్ రెడ్డిని కోరుతున్నాను. కేసీఆర్‌కు ఎంతో నమ్మకంగా పని చేశారు శ్రీనివాస్ రెడ్డి. కేసీఆర్ కూడా భావోద్వేగానికి లోనయ్యారు. వారికి తెలంగాణ భవన్‌లో, వరంగల్‌లో వీడ్కోలు సమావేశాలు ఏర్పాటు చేయాలని కేసీఆర్ ఆదేశించారని హరీశ్‌రావు తెలిపారు.

# ఆరోగ్య ఉత్సవాలకు శ్రీకారం

**హైదరాబాద్,డిసెంబర్8(సమయం న్యూస్):**

ప్రజా పాలన – ప్రజా విజయోత్సవాల్లో భాగంగా ఆరోగ్య ఉత్సవాలకు సీఎం రేవంత్ రెడ్డి శ్రీకారం చుట్టారు. ఎన్టీఆర్ మార్గ్‌లోని హెచ్ఎండీఏ గ్రౌండ్స్‌లో 108, 102 వాహనాలకు పచ్చజెండా ఊపి ప్రారంభించారు. 108 సర్వీసుల కోసం 136 అంబులెన్సులు, 102 సర్వీసుల కోసం 77 అంబులెన్సులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు దామోదర రాజనర్సింహ, పొన్నం ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పలు స్టాళ్లను ఇతర మంత్రులు, నేతలతో కలిసి సీఎం పరిశీలించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో 28 పారామెడికల్, 16 నర్సింగ్ కాలేజీలను సీఎం రేవంత్ రెడ్డి వర్చువల్‌గా ప్రారంభించారు. 33 ట్రాన్స్‌జెండర్ల క్లీనిక్‌లను ప్రారంభించడంతో పాటు 442 మంది సివిల్ అసిస్టెంట్ సర్జన్లు, 24మంది ఫుడ్ ఇన్‌స్పెక్టర్లకు నియామక పత్రాలు అందజేశారు. మైత్రి ట్రాన్స్ క్లీనిక్‌లు ప్రతి గురువారం సేవలందించనున్నాయి. కొత్తగా ప్రారంభించిన వాటితో కలిపి రాష్ట్రంలో ప్రభుత్వ నర్సింగ్ కళాశాలల సంఖ్య 37కి పెరిగింది.

# నన్ను కాల్చి చంపినా నేను పేదల పక్షానే ఉంటా : ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

**హైదరాబాద్, డిసెంబర్ 02 (సమయం న్యూస్):**



సీఎం రేవంత్ రెడ్డి.. మీరు నా మీద ఎన్ని అక్రమ కేసులు పెట్టినా, కాల్చి చంపినా నేను నోరు లేని ఈ పేద బిడ్డల పక్షపాతిగానే ఉంటానని బీఆర్ఎస్ నాయకులు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ తేల్చిచెప్పారు. బీఆర్ఎస్ గురుకుల బాట చేపట్టిన ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌పై రేవంత్ సర్కార్ కేసు నమోదు చేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో సీఎం రేవంత్ రెడ్డిపై ఆర్ఎస్పీ తీవ్రంగా స్పందించారు. మీ సోషల్ మీడియా లీకులు, మీరిచ్చిన స్క్రిప్ట్ ప్రకారం మతిస్థిమితం లేని మంత్రులు, ఎమ్మెల్యేలు, మరెందరో చిల్లర మూకలు నాపై చేస్తున్న దాడికి నేను బెదరను. మీరేసే తాయిలాలకు గతంలో లొంగలేదు, భవిష్యత్తులో కూడా లొంగను. మీరు స్కూళ్లకు తాళాలు వేసుకుంటెనో, పోలీసులతో మమ్ముల అరెస్టు చేయిస్తేనో మా గురుకుల బాట ఆగుతదనుకుంటే మీ అంత మూరు?లు ఇంకొకరుండరు అని రేవంత్ రెడ్డిపై ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ మండిపడ్డారు. ఇక అసలు విషయానికొస్తే.. మీరు ఎందుకు నిజాలను దాచిపెట్టాలని అనుకుంటున్నారో ప్రజలకు చెప్పండి. మీరు చెప్పకపోతే వాటిని చెప్పాల్సిన బాధ్యత మా పిల్లలకోసం మా బీఆర్ఎస్ పార్టీపై ఉంది. మీ బంగళాలో బతికే నలుగురి కోసం నలభై మంది పనిచేయొచ్చు కానీ, మా పేద పిల్లలు చదువుకునే హయత్ నగర్ ప్రతిభా పాఠశాలలో 600 మంది విద్యార్థుల స్కూల్‌ను శుభ్రం చేయడానికి కేవలం ఒకటే ఒక వృద్ధ మహిళను ఎట్ల పెడుతరు..? అదీ ఆమెకు టైంకు జీతాలు ఇవ్వకుండా..? అని ఆర్ఎస్పీ నిలదీశారు. రాష్ట్రంలో అత్యంత ప్రతిభావంతులైన పేద పిల్లలను ఎంట్రన్స్ ద్వారా సెలక్టు చేసి వాళ్లకు అవసరమైన ఉపాధ్యాయులను ఇవ్వకపోతే వాళ్ల భవిష్యత్ కు భరోసా ఎవ్వరు..? హయత్ నగర్‌లో ఇంటర్మీడియట్‌కు ఇప్పటికీ ఇద్దరు జూనియర్ లెక్చరర్స్ లేరని పిల్లలు కన్నీరు పెట్టుకున్నారు. వాళ్లు పరీక్షలు ఎట్ల పాసైతరు? మీ పిల్లలకు టీచర్లు లేకపోతే మీరు ఊరుకుంటారా? ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో పిల్లలు ఇంగ్లీష్ మాట్లాడలేని పరిస్థితి దాపురించిన పరిస్థితిని మీరెట్ల చూస్తరు? అని రేవంత్ రెడ్డిని ప్రవీణ్ కుమార్ ప్రశ్నించారు.

# విజయవాడలో ట్రాఫిక్ అంబాసిడర్లు

### అస్రం యాప్‌తో ట్రాఫిక్ గుర్తింపు
### పోలీస్ కమిషనర్ సి.రాజశేఖర్ బాబు

**విజయవాడ,డిసెంబర్8(సమయం న్యూస్):**

ట్రాఫిక్ సమస్యల్ని పరిష్కరించేందుకు ట్రాఫిక్ అంబాసిడర్లను ఏర్పాటు చేయనున్నట్లు విజయవాడ నగర పోలీస్ కమిషనర్ సి.రాజశేఖర్ బాబు తెలిపారు. ట్రాఫిక్ సిగ్నల్స్‌ను పటిష్ఠపరచడంతోపాటు ట్రాఫిక్‌లో విప్లవాత్మక మార్పులను చేయబోతున్నామన్నారు. ట్రాఫిక్ అంతరాయం ఎక్కడ ఉంటుందో డ్రోన్ అక్కడ ఉంటుంది. ట్రాఫిక్‌ను పసిగట్టి వెంటనే సమాచారం చేరవేస్తుంది. అనేక సందర్భాల్లో ఫిజికల్ పోలీసింగ్ అందుబాటులో ఉండకపోవచ్చు. అన్‌ఏ÷–లాన్‌డ్ ఇన్సిడెంట్స్‌ని గుర్తించడమే ఈ యాప్ పని. పోలీసులు ఈ యాప్‌ని ఉపయోగించి త్వరగా స్పందిస్తున్నారని అన్నారు.ఎక్కడైనా ట్రాఫిక్ జామ్ కాగానే వెంటనే వాట్సప్ గ్రూపులో ఫొటోలు అప్‌లోడ్ చేయాలన్నారు. అక్టోబర్ నుంచి నవంబర్‌కు ట్రాఫిక్ అంతరాయాలను తగ్గించగలిగాం. అస్త్రం యాప్‌లో రియల్ టైం డేటా సేకరించి ప్రజలకు సేవలందిస్తున్నాం. ట్రాఫిక్ రద్దీ తగ్గాలంటే టెక్నాలజీ వినియోగించాలి. కంట్రోల్ రూమ్ నుంచే జంక్షన్ కానిస్టేబుల్‌కు సూచనలందిస్తున్నాం. రెడ్ ఎఫ్ఎం ద్వారా ట్రాఫిక్‌పై మెసేజ్‌లను ఇస్తున్నాం. త్వరలోనే ఐదు జంక్షన్లలో ఎల్ఈడీ బోర్డులను ఏర్పాటు చేయబోతున్నాం. కొన్ని డ్రోన్లను వెస్ట్ బైపాస్‌కి, రామవరప్పాడు రింగు రోడ్ వరకు ఏర్పాటు చేస్తాం. రేపు మధ్యాహ్నం ట్రాఫిక్ ఎలా ఉండబోతుందనేది అస్త్రం అనే ఏఐ టూల్ ద్వారా తెలుసుకుంటాం. డిసెంబర్‌లో ఇంకొంచెం మెరుగుపడేలా మార్పులు చేశాం. డీసీపీ గౌతమి బెంగళూరులోని ట్రాఫిక్ నిబంధనల గురించి చెప్పినప్పుడు ఇక్కడ కూడా కఠినంగా అమలు చేయాలని ఆలోచించాం. ఓ ఫీడ్‌బ్యాక్ మెకానిజంలా అస్త్రం యాప్ ఉపయోగపడుతుందని సీపీ వివరించారు.

# రాయలసీమలో రెండో రాజధాని పెట్టాలి

**అమరావతి, డిసెంబర్ 2 (సమయం న్యూస్) :**

కర్నూలులో ఏర్పాటు కావాల్సిన హైకోర్టును అమరావతికి తీసుకెళ్లి, హైకోర్టు బెంచ్ ను కర్నూలులో ఏర్పాటు చేస్తామని చెప్పడం సరికాదని మాజీ మంత్రి సాకే శైలజానాథ్ అన్నారు. హైకోర్టును కర్నూలులో ఏర్పాటు చేస్తామని గత వైసీపీ ప్రభుత్వం ప్రతిపాదించిందని గుర్తు చేశారు. అమరావతికి హైకోర్టును తరలించడం సరికాదని అన్నారు. కర్నూలులో బెంచ్ ను ఏర్పాటు చేయడం రాయలసీమకు అన్యాయం చేయడమేనని చెప్పారు. కడప కేంద్రంగా ఉన్న ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు ప్రధాన కార్యాలయాన్ని అమరావతికి తరలించారని... కడపలో ఉంటే ఇబ్బంది ఏమిటని ఆయన ప్రశ్నించారు. రాజధానిని, హైకోర్టును అమరావతిలో ఏర్పాటు చేస్తున్నందువల్ల... రాయలసీమ ప్రాంతంలో రెండో రాజధానిని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఏకపక్ష నిర్ణయాలతో ప్రాంతీయ విభేదాలు తలెత్తి... మళ్లీ వేర్పాటువాదం బలపడే ప్రమాదం ఉందని అన్నారు.

# ఏ అంశంపై నైనా ప్రజలు చెప్పిందే ఫైనల్

**ప్రజల నుంచి నిరంతర ఫీడ్ బ్యాక్ తీసుకోవాలి**
**ఫీడ్ బ్యాక్ ఆధారంగానే సేవలలో మార్పులు**
**మెరుగైన సేవల కోసం నేరుగా అభిప్రాయ సేకరణ**
**ఐవిఆర్ఎస్ విధానాన్ని విస్తృతంగా ఉపయోగించాలి**
**నాణ్యమైన సేవలకై ప్రజలు ఖచ్చితమైన అభిప్రాయం చెప్పాలి**
**ప్రజలను కోరిన ఏపీ సీఎం చంద్రబాబు**
**ప్రజాభిప్రాయ సేకరణతో ముందుకు వెళ్లాలని నిర్ణయం**

**అమరావతి, డిసెంబర్ 2 (సమయం న్యూస్) :**

చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం సరికొత్త నిర్ణయాన్ని తీసుకుంది. ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాలు, పౌర సేవలపై ప్రజల నుంచి నిరంతర ఫీడ్ బ్యాక్ తీసుకోవాలన్నది ఆ నిర్ణయం. ఆ ఫీడ్ బ్యాక్ ఆధారంగానే సేవలలో మార్పులు, కొనసాగించాలని ముఖ్యమంత్రి తాజా ఆదేశాలిచ్చారు.. మెరుగైన సేవల కోసం నేరుగా లబ్ధిదారుల నుంచి అభిప్రాయ సేకరణ చేపట్టాలని సూచించారు. అందుకు ఐవిఆర్ఎస్ విధానాన్ని విస్తృతంగా ఉపయోగించాలని సూచించారట. ఏ అంశంపైనైనా ప్రజలు చెప్పిందే ఫైనల్ కావాలని, నాణ్యమైన సేవల కోసం ఖచ్చితమైన అభిప్రాయం చెప్పాలని కూడా ప్రజలను కోరుతున్నారు ఏపీ సీఎం చంద్రబాబు.. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసే పథకాలు, చేపట్టే కార్యక్రమాలు, తీసుకునే నిర్ణయాలపై ప్రజాభిప్రాయ సేకరణ ప్రకారం ముందుకు వెళ్లాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ప్రజలకు మెరుగైన, నాణ్యమైన సేవలు అందించేందుకు వారి అభిప్రాయాల మేరకు నడుచుకోవాలనుకుంటోంది. దీనిలో భాగంగా ఇకపై ప్రభుత్వం అమలు చేసే పథకాలపై ఫోన్లు చేయడం ద్వారా ఆయా కార్యక్రమాల అమలు తీరును తెలుసుకోనుంది. లబ్ధిదారులకే నేరుగా కంప్యూటర్ బేస్డ్ ఫోన్ కాల్స్ ద్వారా ఆ పథకం వల్ల ప్రయోజనం, దాని అమలు, సేవల్లో నాణ్యత వంటి అంశాలపై ప్రజల నుంచి ఫీడ్ బ్యాక్ తీసుకోనుంది. లబ్ధిదారుల నుంచి ఆయా పథకాల అమలుపై వారి అభిప్రాయం కోరుతూ ఐవీఆర్ఎస్ కాల్స్ వెళతాయి. వాటిపై ప్రజలు ఇచ్చే రేటింగ్ ఆధారంగా ప్రభుత్వం మార్పులు చేర్పులు చేసుకుని పని చేయనుంది. ఇంటింటికీ పింఛన్లు, దీపం పథకం కింద ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ వంటి పథకాల లబ్ధిదారుల నుంచి ఈ ఫీడ్ బ్యాక్ తీసుకుంటున్నారు. పింఛను సక్రమంగా ఇంటి వద్దనే అందుతుందా లేదా..? దీపం పథకం ఉచిత గ్యాస్ సిలిండర్ పొందడంలో ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా..? వంటి ప్రశ్నల ద్వారా లబ్ధిదారుల నుంచి ఇకపై నిరంతరం అభిప్రాయాలు తీసుకోనున్నారు. పథకాలతో పాటు ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన పాలసీల అమలుపైనా ప్రజాభిప్రాయం తెలుసుకోనుందట చంద్రబాబు ప్రభుత్వం. ఉచిత ఇసుక విధానం అమలు, మద్యం కొత్త పాలసీ, అమ్మకాలపైనా ప్రజల నుంచి అభిప్రాయాలు సేకరించనున్నారు. పథకాలు, కార్యక్రమాలతో పాటు రానున్న రోజుల్లో రెవెన్యూ, మునిసిపల్, విద్యుత్ వంటి పలు కీలక శాఖల్లో ప్రజలు పొందుతున్న పౌరసేవలపై కూడా %×ఎ=ా% ద్వారా ప్రజల నుంచి సమాచారం సేకరించనున్నారు. నేరుగా ప్రజల నుంచి వచ్చే ఈ సమాచారంలో ప్రజలు ఎక్కడైనా అసంతృప్తి వ్యక్తం చేస్తే..వాటికి గల కారణాలు విశ్లేషించి సేవలను మరింత మెరుగుపరచనున్నారు. ఈ క్రమంలో ప్రభుత్వ అధికారులు, ఉద్యోగుల్లో కూడా బాధ్యత పెంచి మంచి సేవలు ప్రజలకు అందేలా చేయాలని ప్రభుత్వం భావిస్తోందట.. ప్రజలు చెప్పిందే ఫైనల్ అనే విషయం ప్రాతిపదికన ప్రభుత్వం పనిచేయాలని ముఖ్యమంత్రి భావిస్తున్నారట.. అదే సమయంలో ఇలా ప్రభుత్వం నుంచి వచ్చే ఫోన్ కాల్స్ కు ప్రజలు ఓపిగ్గా తమ అభిప్రాయాలు చెప్పాలని ముఖ్యమంత్రి చంద్రబాబు కోరుతున్నారు. ఈ ఫోన్ కాల్స్ కు ప్రజలు వెచ్చించే ఒకటి రెండు నిముషాల సమయంతో ప్రభుత్వ నుంచి ఉత్తమ సేవలు పొందే అవకాశం ఏర్పడుతుందని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. దీనికి ప్రజలు తమ వంతుగా సహకరించాలని.. మంచి పాలనకు, నాణ్యమైన ప్రభుత్వ సేవలు అందించే కార్యక్రమంలో ప్రజలు కూడా భాగస్వాములు కావాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కోరారు. ఐవిఆర్ఎస్ విధానం ద్వారా వచ్చే ఖచ్చితమైన అభిప్రాయాల ద్వారా గతంలో మంచి ఫలితాలు సాధించిన సందర్భాలు ఉన్నాయి. సార్వత్రిక ఎన్నికల సమయంలో పార్టీ అభ్యర్థుల ఖరారు విషయంలో చంద్రబాబు ఇదే విధానాన్ని పాటించారు. అలాగే విజయవాడ వరదల సమయంలో ప్రజలకు ప్రభుత్వం నుంచి అందే సాయంపైనా కాల్స్ ద్వారా సమాచారం తీసుకున్నారు. ఇప్పుడు ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాల్లో దీన్ని విరివిగా వాడేందుకు ముఖ్యమంత్రి నిర్ణయం తీసుకున్నారనీ సీఎంఓ తెలిపింది.

## చేవెళ్లలో ఘోరరోడ్డు ప్రమాదం

**అదుపుతప్పి దూసుకెళ్లిన లారీ**
**ముగ్గురు చిరు వ్యాపారలు దుర్మరణం**

**వికారాబాద్,డిసెంబర్8(సమయం న్యూస్):**

రంగారెడ్డి జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. చేవెళ్ల మండలం ఆలూరు స్టేజి వద్ద ఓ లారీ బీభత్సం సృష్టించింది. ఈ ఘటనలో ముగ్గురు దుర్మరణం చెందారు. పలువురు తీవ్రంగా గాయపడ్డారు. లారీ బీభత్సంతో ఈ ప్రాంతం భీతావహంగా మారంది. హైదరాబాద్ –బీజాపూర్ రహదారి పక్కన దాదాపు 50 మంది కూరగాయలు విక్రయిస్తుండగా.. వారిపైకి లారీ దూసుకెళ్లడంతో ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. దూసుకొస్తున్న లారీని చూసి అక్కడి జనమంతా భయంతో పరుగులు తీశారు. వ్యాపారులపైకి దూసుకెళ్లిన లారీ చెట్టును ఢీకొట్టి ఆగింది. లారీ డ్రైవర్ మాత్రం క్యాబిన్‌లో ఇరుక్కుపోయాడు. హైదరాబాద్ నుంచి వేగంగా వస్తున్న ఈ లారీ ఢీకొట్టడంతో చెట్టు నేలకూలింది. ఈ ఘటనతో హైదరాబాద్– బీజాపూర్ రహదారిపై భీతావహ వాతావరణం నెలకొంది. లారీ సృష్టించిన బీభత్సంలో మృతులను రాములు (ఆలూరు), ప్రేమ్ (ఆలూరు), సుజాత (ఖానాపూర్)గా గుర్తించారు. ఈ ఘటనలో మరికొందరికి గాయాలైనట్లు తెలుస్తోంది. క్షతగాత్రులను చేవెళ్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనలో మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉన్నట్లు సమాచారం. దాదాపు వంద మీటర్ల దూరం నుంచే లారీ అదుపు తప్పిన విషయాన్ని గమనించిన కూరగాయల వ్యాపారులు పరుగులు పెట్టారు. రంగంలోకి దిగిన పోలీసులు కూలిన చెట్టును జేసీబీతో పక్కకు తొలగించారు. ఘటనా స్థలానికి కి.మీల దూరంలో ఆదివారం కూడా రోడ్డు ప్రమాదం జరిగింది. లారీ, కారు ఢీకొని బీడీఎల్ ఉద్యోగి దంపతులు దుర్మరణం చెందారు. వరుస ప్రమాదాలతో స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ రోడ్డును విస్తరించాలని ఏళ్ల తరబడి కోరుతున్నా పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## సీఎం చంద్రబాబుతో పవన్ కల్యాణ్ భేటీ

**రాజ్యసభ సభ్యుల ఎంపిక, బీజేపీ ప్రతిపాదనపై చర్చ**
**తాజా రాజకీయ పరిణామాలు ప్రస్తావన**
**కాకినాడలో రేషన్ బియ్యం మాఫియాపై ఆరా**
**నామినేటేడ్ పోస్టులపై కసరత్తు..**
**మరో 15 రోజుల్లో ప్రకటన**

**అమరావతి, డిసెంబర్ 02(సమయం న్యూస్):**

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడితో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ భేటీ అయ్యారు. సోమవారం మధ్యాహ్నం ఉండవల్లిలోని సీఎం చంద్రబాబు నివాసంలో ఈ సమావేశం జరిగింది. ఈ భేటీలో వీరిద్దరి మధ్య పలు కీలక అంశాలు చర్చకు వచ్చినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా రాజ్యసభ సభ్యుల ఎంపిక, బీజేపీ ప్రతిపాదనపై చర్చ జరిగినట్లు తెలుస్తోంది. ఇటీవల ఢిల్లీ పర్యటన వివరాలను చంద్రబాబు దృష్టికి పవన్ తీసుకొచ్చినట్లు సమాచారం.. అంతే కాకుండా తాజా రాజకీయ పరిణామాలు సైతం ప్రస్తావనకు వచ్చాయి. కాకినాడలో రేషన్ బియ్యం మాఫియా పైనా సీఎం, డిప్యూటీ సీఎం చర్చించారు. ఇక సోషల్ మీడియాలో పోస్టులపై తీసుకుంటున్న చర్యలపైనా ఇరువురు నేతలు చర్చించినట్లు తెలుస్తోంది..వైసీపీ రాజ్యసభ సభ్యుల రాజీనామాతో ఖాళీ అయిన మూడు స్థానాల్లో.. ఎన్నికలు జరగనున్నాయి.. నేటి నుంచి నామినేషన్లను స్వీకరించనున్న తరుణంలో చంద్రబాబు, పవన్ కల్యాణ్ భేటీ కావడం ఆసక్తి రేపింది.. ఈ భేటీలో రాజ్యసభకు వెళ్లే వారి పేర్లు తెరపైకి వచ్చినట్లు తెలుస్తోంది.. టీడీపీకి ప్రస్తుతం రాజ్యసభలో ప్రాతినిధ్యం లేదు. దీంతో ఈ ఉప ఎన్నిక ద్వారా పెద్దల సభలోకి మళ్లీ ఎంట్రీ అవ్వాలని భావిస్తోంది. అయితే.. రాజ్యసభ రేసులో టీడీపీ నుంచి మాజీ రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్ రావు, ఇక గుంటూరు ఎంపీ సీటును త్యాగం చేసిన మాజీ ఎంపీ గల్లా జయదేవ్, కంభంపాటి రామ్మోహన్ ఉన్నట్లు టాక్ వినిపిస్తోంది.. జనసేన కూడా ఓ స్థానాన్ని అడుగుతున్నట్లు సమాచారం.. పొత్తు ధర్మంలో భాగంగా.. అనకాపల్లి లోక్ సభ సీటుని త్యాగం చేసిన మెగాబ్రదర్ నాగబాబు కూడా రేసులో ఉన్నారని సమాచారం.. దీంతో ఆయనకు రాజ్యసభ అవకాశం ఇవ్వాలన్న వాదన వినిపిస్తోంది. ఇక బీజేపీ కూడా మిత్రధర్మంగా తమకు ఒక సీటును ఆశిస్తున్నట్టు తెలుస్తోంది. ఆపార్టీ నుంచి మాజీ సీఎం కిరణ్ కుమార్‌రెడ్డి రేసులో ఉన్నట్లు సమాచారం.. ముఖ్యంగా రాజ్యసభ ఎన్నికలపై ఇద్దరి మధ్య చర్చ జరిగినట్లు టాక్ వినిపిస్తోంది. రాజ్యసభకు డిసెంబర్ 3 నుంచి 10 వరకు నామినేషన్లను స్వీకరించనున్నారు. నామినేషన్ల ఉపసంహరణకు గడువు డిసెంబర్ 13. డిసెంబర్ 20న పోలింగ్ నిర్వహించి అదే రోజు ఫలితాలను ప్రకటించనుంది ఎన్నికల సంఘం.. కాగా.. ఒక్క రాజ్యసభ అభ్యర్థి విజయం సాధించాలంటే కనీసం 25 మంది ఎమ్మెల్యేల మద్దతు అవసరం.. ప్రస్తుతం వైసీపీ బలం 11 మాత్రమే. అందువల్ల ఆ పార్టీ రాజ్యసభ బరిలో నిలిచే అవకాశం లేదు. దీంతో మొత్తం రాజ్యసభ స్థానాలు కూటమి పార్టీలకే దక్కనున్నాయి. అలాగే రాజధాని అమరావతిలో చేపట్టబోయే అభివృద్ధి పనులపై చంద్రబాబు, పవన్ కళ్యాణ్ చర్చించారు. డిసెంబర్ 15వ తేదీ నుంచి అమరావతి పనులను వేగవంతం చేయాలని ఈ సందర్భంగా వారు నిర్ణయించారు. అలాగే రాష్ట్రంలో తాజా రాజకీయ పరిణామాలతోపాటు ఇటీవల ఢిల్లీ వేదికగా చోటు చేసుకున్న కీలక పరిణామాలపై వీరు చర్చించారు. అయితే సీఎం చంద్రబాబు నాయుడు సోదరుడు నారా రామ్మూర్తి నాయుడు ఇటీవల మృతి చెందారు. ఈ నేపథ్యంలో ఆయన మృతి పట్ల డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ విచారం వ్యక్తం చేశారు.ఇక నామినేటెడ్ పోస్టుల విషయంలో త్వరలో నాలుగో జాబితా విడుదలపై కసరత్తు చేస్తున్నారు. అందులోభాగంగా పలువురి పేర్లు ప్రస్తావనకు వచ్చినట్లు సమాచారం. మూడు జాబితాల విషయంలో ఎటువంటి వివాదాలకు తావు లేకపోవడంతో నాలుగు జాబితా సైతం కష్టపడి పని చేసిన వారికి పదవులు కేటాయించాలని వీరిద్దరు ఒక నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తుంది. మరో 15 రోజుల్లో నాలుగో జాబితా విడుదల చేసే అవకాశముంది. కాకినాడ పోర్ట్ నుంచి ప్రజా పంపిణి బియ్యం స్మగ్లింగ్ అవుతున్న నౌకను డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ స్వయంగా సీజ్ చేయించారు. ఈ నేపథ్యంలో ఈ విషయం రాష్ట్రవ్యాప్తంగా సంచలనమైంది. ఈ అంశంపై వైసీపీ నేతలు పేర్ని నాని, ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ ఆరోపణలు గుప్పించిన సంగతి తెలిసిందే. అయితే ఈ బియ్యం అక్రమ రవాణా విషయంపై సీఎం చంద్రబాబు సీరియస్ అయిన విషయం విధితమే. తాజాగా వీరి భేటీలో ఈ అంశాన్ని ప్రధానంగా చర్చించినట్లు సమాచారం ఇక ఈ ఏడాది మే, జూన్ మాసాల్లో ఏపీ అసెంబ్లీ, సార్వత్రిక ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో బీజేపీ, జనసేన, టీడీపీ కలిసి కూటమిగా ఏర్పడి ఎన్నికలకు వెళ్లాయి. ఈ ఎన్నికల్లో సీట్ల సర్దుబాటులో భాగంగా ఈ మూడు పార్టీలకు చెందిన ఆశావహులు.. ఎన్నికల బరిలోకి దిగలేదు. ఈ నేపథ్యంలో వారికి నామినేటేడ్ పదవులు కేటాయిస్తామని.. ముందే పార్టీల అధినేతలు హామీ ఇచ్చారు. దీంతో ఈ ఎన్నికల్లో కూటమి ఘన విజయం సాధించింది. దీంతో నామినేటేడ్ పోస్టుల భర్తీకి కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. అందులోభాగంగా ఇప్పటికే మూడు జాబితాలను విడుదల చేసింది. నాలుగో జాబితా విడుదలకు రంగం సిద్ధం చేస్తుంది.

## పీడీఎస్ బియ్యం తరలింపు వెనుక పెద్ద మాఫియా

**ఇదో జాతీయస్థాయి కుంభకోణం**
**నిజాలు నిగ్గు తేల్చాలని వైఎస్ షర్మిల డిమాండ్**

**అమరావతి, డిసెంబర్ 2 (సమయం న్యూస్) :**

ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కొన్నిరోజుల కింద కాకినాడ పోర్టులో తనిఖీలు చేపట్టిన నేపథ్యంలో, రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తీవ్రస్థాయిలో స్పందించారు. రాష్ట్రంలో పీడీఎస్ బియ్యం విదేశాలకు తరలించడం వెనుక పెద్ద మాఫియా ఉందని, ఇదో జాతీయస్థాయి కుంభకోణం అని పేర్కొన్నారు. అక్రమ బియ్యాన్ని పట్టుకునేందుకు బోట్లు వేసుకుని సముద్రంలో హడావిడి చేయడం కాదు... నిజాలు వెలికి తీయాలి... ఈ మేరకు కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం అని షర్మిల స్పష్టం చేశారు. "పేదల పొట్టకొట్టి రూ.48 వేల కోట్ల ప్రజల డబ్బును పందికొక్కుల్లా తినేశారు. రేషన్ బియ్యం అక్రమ రవాణా వెనుక ప్రజా ప్రతినిధుల హస్తం ఉంది. క్షేత్రస్థాయి నుంచి ఉన్నతస్థాయి వరకు కొంతమంది అవినీతి అధికారుల పాత్ర ఉంది. ఎవరికి దక్కాల్సిన వాటా వాళ్లకు చేరుతుండడంతో నిఘా వ్యవస్థ పూర్తిగా కళ్లు మూసుకుంది! గత మూడేళ్లలో ఏపీలోని పోర్టుల నుంచి 2 కోట్ల టన్నుల రేషన్ బియ్యం అక్రమంగా రవాణా అయింది. దీన్ని బట్టే మన చెక్ పోస్టుల పనితీరు ఎలా ఉందో అంచనా వేయొచ్చు. పేదలకు చెందాల్సిన రేషన్ బియ్యం పోర్టుల వరకు ఎలా వెళుతోంది? గత ప్రభుత్వ పెద్దలకు రైస్ మాఫియాతో లింకులు ఉన్నాయా? ఇందులో మిల్లర్ల చేతివాటం ఉందా? రేషన్ డీలర్ల మాయాజాలమా? ప్రతి రోజు తనిఖీల సంగతేంటి? ఈ నిజాలు వెలికితీయాల్సిన అవసరం ఉంది. పీడీఎస్ బియ్యం అక్రమ రవాణాపై ప్రభుత్వం ప్రత్యేక దర్యాప్తు కమిటీ వేయాలి. లేకపోతే విచారణ బాధ్యతలు సీబీఐకి అప్పగించండి. ఏపీ అంటే అన్నపూర్ణమ్మ... మనది ప్రపంచానికి అన్నం పెట్టే రాష్ట్రం. అలాంటి రాష్ట్రాన్ని రేషన్ బియ్యం మాఫియాకు అడ్డాగా మార్చారు. కష్టపడి పంట పండించే రైతుకు కన్నీళ్లు దక్కుతుంటే... బియ్యం అక్రమార్కులకు కాసులు దక్కుతున్నాయి... ఇదీ మన రాష్ట్ర దుస్థితి" అంటూ షర్మిల సోషల్ మీడియాలో ధ్వజమెత్తారు. తన పోస్టుకు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ లను ట్యాగ్ చేశారు.

## పవన్ తీరు చూస్తుంటే గబ్బర్ సింగ్-3 గుర్తుకు వస్తోంది

అమరావతి, డిసెంబర్ 2 (సమయం న్యూస్) :ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, ఏపీ కాంగ్రెస్ చీఫ్ షర్మిలపై వైసీపీ ఎమ్మెల్సీ, మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ విమర్శలు గుప్పించారు. కాకినాడ పోర్ట్ నుంచి బియ్యం స్మగ్లింగ్ అవుతోందని పవన్ అంటున్నారని... స్మగ్లింగ్ చేస్తున్న వాళ్లపై చర్యలు తీసుకోవద్దని ఎవరన్నారని ప్రశ్నించారు. పవన్ తీరు చూస్తుంటే గబ్బర్ సింగ్-3 గుర్తుకు వస్తోందని అన్నారు. మంత్రి ప్రమేయం లేకుండానే ఇలాంటి కార్యక్రమాలు జరుగుతాయా? అని ప్రశ్నించారు. పవన్ చిత్తశుద్ధిని తాను శంకించడం లేదని చెప్పారు. 2004లో మంత్రి అయినప్పుడు తనకు ఎన్నో అధికారాలు ఉంటాయని భ్రమ పడ్డానని తెలిపారు. మంత్రి పదవి వచ్చినప్పుడు తొలుత 'హా' అంటామని... ఆ తర్వాత 'ఆ' అంటామని చెప్పారు. కూటమి ప్రభుత్వంపై మాజీ మంత్రి, వైసీపీ ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ విమర్శలు గుప్పించారు. ప్రభుత్వం ఏర్పడి ఆరు నెలలు అయిందని... ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఇప్పటి వరకు అమలు చేయలేదని ఆయన విమర్శించారు. ఎన్నికల హామీలను నెరవేర్చాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని చెప్పారు. ప్రజలపై విద్యుత్ ఛార్జీల భారం మోపారని... యూనిట్ కు రూ. 1.20 పెంచారని బొత్స అన్నారు. విద్యుత్ ఛార్జీలను పెంచడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రజలపై అప్పుల భారాన్ని పెంచుతున్నారంటూ వైసీపీ ప్రభుత్వంపై దుష్ప్రచారం చేశారని... కూటమి ప్రభుత్వం గత 6 నెలల్లో చేసిన రూ. 70 వేల కోట్ల అప్పులు ఎక్కడికి పోయాయని అడిగారు. మీ సోకులకు వాడుకుంటున్నారా? అని ప్రశ్నించారు. పెన్షన్లు తప్ప ఒక పథకాన్ని కూడా కూటమి ప్రభుత్వం ఇవ్వడం లేదని మండిపడ్డారు. ప్రజల్లో కొనుగోలు శక్తి పడిపోయిందని బొత్స అన్నారు. గతంలో పథకాలు అందడం వల్ల మార్కెట్ మంచిగా ఉండేదని చెప్పారు. ఇప్పుడు వ్యాపారాలేమీ జరగడం లేదని అన్నారు. వాటాల కోసం ఎమ్మెల్యేలు తన్నుకుంటున్నారని... ఆ గొడవలకు చంద్రబాబు పంచాయితీ చేయడం ఏమిటని ఎద్దేవా చేశారు. బెల్ట్ షాపులకు కూడా వేలం వేస్తున్నారని... తమ సమీప గ్రామంలో బెల్టు షాపుకు రూ. 50 లక్షలకు వేలం వేశారని చెప్పారు. షర్మిల ఒక రాజకీయ పార్టీ నాయకురాలిగా మాట్లాడటం లేదని బొత్స అన్నారు. ఆమెను మీరు గుర్తిస్తున్నారేమో కానీ, తాము మాత్రం గుర్తించడం లేదని చెప్పారు. పీసీసీ చీఫ్ గా పలు అంశాలపై మాట్లాడాలని, వ్యక్తిగతంగా టార్గెట్ చేస్తూ మాట్లాడకూడదని అన్నారు. గతంలో తాను కూడా పీసీసీ అధ్యక్షుడిగా పని చేశానని గుర్తు చేసుకున్నారు.

## మీడియా అత్యుత్సాహం ప్రదర్శిస్తోంది

**దర్శకుడు రామ్‌గోపాల్ వర్మ విమర్శలు**

**హైదరాబాద్,డిసెంబర్8(సమయం న్యూస్):**

సంచలన దర్శకుడు రామ్‌గోపాల్ వర్మ అరెస్ట్‌కు సంబంధించి గత కొన్ని రోజులుగా చర్చ సాగుతోన్న విషయం తెలిసిందే. వర్మను పోలీసులు అరెస్ట్ చేయబోతున్నారని. అందుకే వర్మ తప్పించుకుని తిరుగుతున్నాడని పెద్ద ఎత్తున వార్తలు వచ్చాయి. అయితే వర్మ తాజాగా ఈ వార్తలపై స్పందించారు. తన అరెస్ట్ విషయంలో ఒక సెక్షన్ మీడియా అత్యుత్సాహం ప్రదర్శిస్తోందని ఆరోపణలు చేశారు. వర్మపై కేసులు నమోదైన నేపథ్యంలో తొలిసారి బహిరంగంగా మాట్లాడారు. సోమవారం హైదరాబాద్ ప్రసాద్ ల్యాబ్స్‌లో ఏర్పాటు చేసిన మీడియా నమోదు కావడంపై దర్శకుడు రామ్ గోపాల్ వర్మ స్పందించారు. ఈ రోజు హైదరాబాద్ ప్రసాద్ ల్యాబ్స్ లో పాత్రికేయ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తనపై నమోదైన కేసులు ఉద్దేశపూర్వకంగా ఉన్నాయనే అనుమానంతోనే ముందస్తు బెయిల్ కోసం అప్లై చేసుకున్నానని తెలిపారు. మనది ఫ్రీ వరల్డ్ అన్న వర్మ, వ్యంగ్యం అనేది మీడియా సహా ప్రతి చోటా ఉంటుందన్నారు. ప్రస్తుతం సోషల్ మీడియాను ఓపెన్ చేస్తే వందలాది మీమ్స్ కనిపిస్తాయన్న వర్మ.. తాను ఏడాది క్రితం చేసిన పోస్ట్ కూడా అలాంటిదేనని క్లారిటీ ఇచ్చారు. అయితే ఏడాది తర్వాత ఒక వ్యక్తి మేలుకుని తనపై పోలీస్ స్టేషన్ లో కంప్లైంట్ ఇచ్చాడన్నారు. ఈ పోస్టును కారణంగా చూపుతూ ఏపీలోని అనేక చోట్ల కేసులు నమోదు అయ్యాయని, ఇది ఉద్దేశపూర్వకంగా చేస్తున్నదే అనే అనుమానంతో నేను ముందస్తు బెయిల్ కోసం అప్లై చేసుకున్నానని తెలిపారు. పోలీసులు ఇంతవరకు నను అరెస్ట్ చేస్తున్నట్లు కూడా ప్రకటించలేదన్న వర్మ.. ఇంతలో ఒక సెక్షన్ మీడియా సంస్థలు వర్మను ఎందుకు అరెస్ట్ చేయడం లేదని, వర్మ భయపడి పారిపోయాడని న్యూస్ టెలికాస్ట్ చేస్తూ వస్తున్నాయన్నారు. ఇదే మీడియా సంస్థలు నాయకులతో పాటు ఇతరుల మీద అనే ప్రోగ్రామ్స్ చేస్తుంటాయన్న వర్మ.. మొదటి సారి పోలీసులు సంప్రదించినప్పుడు తాను అందుబాటులో లేనని, రెండోసారి కూడా ఇంకాస్త సమయం కావాలని అడిగానన్నారు. అయితే కావాలంటే వర్చువల్‌గా వీడియోలో మాట్లాడుతానని పోలీసులకు తెలిపినట్లు వర్మ తెలిపారు. ఇక తాను అప్లై చేసుకున్న ముందుస్తు బెయిల్ విషయంలో జ్యుడిషియల్ ప్రాసెస్ జరుగుతోందని వర్మ చెప్పుకొచ్చారు. సెన్సార్ ఇబ్బందుల్లే తాను పొలిటికల్ మూవీస్ మానేస్తానని తెలిపినట్లు వర్మ చెప్పుకొచ్చారు. తాను ఏదైనా పోస్ట్ చేస్తే తనను, తన ఫ్యామిలీని తిడుతూ వందల కామెంట్స్, మీమ్స్ వస్తాయన్న వర్మ.. పత్రికల్లో వచ్చే కార్టూన్స్ ఎవరో ఒక నాయకుడి మీద సెటైర్ వేసేవనని, ఇది దశాబ్దాలుగా ప్రపంచవ్యాప్తంగా జరుగుతోందన్నారు. ఇక తాను చేసే పోస్ట్ లో అర్థం ఒక్కొక్కరికి ఒకలా కనిపించవచ్చని, అది ఎవరి వ్యక్తిగత దృష్టి కోణాన్ని బట్టి ఉంటుందన్నారు. తాను చేసిన తప్పేంటో, ఏ సెక్షన్ లో అరెస్ట్ చేస్తున్నారో పోలీసులు చెప్పకముందే కొన్ని మీడియా సంస్థలు హడావుడి చేస్తున్నాయని అన్నారు.

## సజ్జల భార్గవరెడ్డికి సుప్రీంకోర్టులో స్వల్ప ఊరట

**రెండు వారాల వరకు భార్గవరెడ్డిని అరెస్ట్ చేయవద్దని ఆదేశం**

**అమరావతి, డిసెంబర్ 2 (సమయం న్యూస్) :**

వైసీపీ నేత సజ్జల రామకృష్ణారెడ్డి కుమారుడు, వైసీపీ సోషల్ మీడియా ఇన్చార్జి సజ్జల భార్గవరెడ్డికి సుప్రీంకోర్టులో స్వల్ప ఊరట లభించింది. టీడీపీ, వైసీపీ నేతలపై అసభ్యకర పోస్టులను పెట్టిన కేసుల్లో తనపై నమోదైన ఎఫ్ఐఆర్ లను కొట్టివేయాలని కోరుతూ సుప్రీంకోర్టును ఆయన ఆశ్రయించారు. అయితే ఈ పిటిషన్ ను విచారించేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. హైకోర్టులో పిటిషన్లు వేసుకోవాలని సూచించింది. ఏపీ హైకోర్టును ఆశ్రయించేందుకు ఆయనకు రెండు వారాల సమయం ఇచ్చింది. అప్పటి వరకు భార్గవరెడ్డిని అరెస్ట్ చేయవద్దని పోలీసులను ఆదేశించింది. భార్గవరెడ్డి తరపున సీనియర్ న్యాయవాది కపిల్ సిబాల్, ఏపీ ప్రభుత్వం తరపున మరో సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా వాదనలు వినిపించారు. పాత విషయాలకు కొత్త చట్టాల ప్రకారం కేసులు పెడుతున్నారని సిబాల్ అన్నారు. చట్టాలు ఎప్పటివనేది ముఖ్యం కాదని... మహిళలపై చేసిన అసభ్యకర వ్యాఖ్యలను చూడాలని లూథ్రా చెప్పారు. దర్యాప్తుకు కూడా భార్గవరెడ్డి సహకరించడం లేదని... సుప్రీంకోర్టు ముందు కూడా అనేక విషయాలను గోప్యంగా ఉంచారని తెలిపారు. ఈ సందర్భంగా సుప్రీంకోర్టు స్పందిస్తూ... అసభ్య వ్యాఖ్యలు చేసే ఎవరైనా చట్టపరమైన పరిణామాలను ఎదుర్కోవాల్సిందేనని వ్యాఖ్యానించింది.

సమయం
www.epaper.samayamdaily.net APTEL/2006/18267




# తెలుగువారికి పుష్ప 2.. పేరు తేవాలి

## అప్పటికే బాహుబలి, ఆర్ఆర్ఆర్ ద్వారా ఖ్యాతి.. ఐకాన్ స్టార్ అల్లు అర్జున్

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ హీరోగా నటించిన పుష్ప 2 చిత్రం డిసెంబర్ 5న ప్రపంచ వ్యాప్తంగా విడుదల కానుంది. ప్రమోషన్లలో భాగంగా సోమవారం హైదరాబాద్ లో పుష్ప గాడి వైల్డ్ ఫైర్ జాతర ఈవెంట్ నిర్వహించారు. యుసూఫ్ గూడలోని పోలీస్ గ్రౌండ్ లో జరిగింది. ఈ కార్యక్రమానికి ప్రముఖులు హాజరయ్యారు. ఈ సినిమా గురించి మాట్లాడారు. వారి మాటల్లోనే..

బాహుబలి, ఆర్ఆర్ఆర్ తెలుగు వారికి పేరు తెచ్చాయి. ముచ్చటగా మూడోసారి పుష్ప2తో పేరు తేవాలి. అందుకే ఈ సినిమా బాడా ఆడాలని కోరుకుంటున్నా. 12 వేలస్క్రీన్ లు, 80 దేశాల్లో పుష్ప 2 వస్తోంది. చాలా గర్వంగా ఉంది. అదే పుష్ప ది రూల్. ఇంతకంటే ఇంకేం కావాలి. నా ఆర్మీకి ధన్య వాదాలు నా కష్టం అభిమానులకు అంకితం.

## ఇంకొక సినిమాకు అవకాశం ?

### హీరోయిన్ రష్మిక మందన్న

"అందరూ బాగున్నారా? మేము దేశం వ్యాప్తంగా ఈ సినిమా ప్రమోట్ చేయడానికి తిరిగాం. కానీ నేను ఎక్కడ ఎక్కువగా మాట్లా డలేదు. ఈరోజు కొంచెం టైం తీసుకుని అయినా మాట్లాడుతాను. పుష్ప 1 చేస్తు న్నప్పుడే పుష్ప 2లో ఇంతకంటే బాగా చేయా లనుకున్నాను. సుకుమార్ దర్శకత్వంలో ఇంకొక సినిమాకు అవకాశం వస్తుందని ఆశి స్తున్నాను.

## ఆ ఎపిసోడ్ తోనే అర్థమైంది

### దర్శకుడు ఎస్ ఎస్ రాజమౌళి



పుష్ప 1 సమయంలో బన్నీతో నార్త్ ఇండియాని వదలకు. అక్కడ నీకోసం ఎంతోమంది అభిమానులు ఉన్నారు ఇప్పుడు మూడు సంవ త్సరాల తర్వాత పుష్ప 2 సినిమా ప్రపంచవ్యాప్తంగా ఎటువంటి ప్రమోషన్స్ అవసరం లేనంతగా క్రేజ్ ఉంది. సాధారణంగా ఏ సినిమా ఈవెంట్కైనా వెళ్ళి నప్పుడు ఆ సినిమాకు ఉప యోగపడేలా ఏదైనా మాట్లా డుతాము, కానీ ఈ సినిమాకు అటువంటి అవసరం లేదు. కాబట్టి సరదాగా మీతో ఒక విషయాన్ని వంచుకోవాలనుకుంటున్నాను. సుమారు రెండు మూడు నెలల క్రితం రామోజీ ఫిలిం సిటీలో పుష్ప షూటింగ్ జరు గుతుండగా అక్కడికి వెళ్లాను. సుకుమార్ నాకు సినిమాలో ఒక సీన్ చూపించడం జరిగింది. ఆ సీన్ పుష్ప రాజ్ ఇంట్రడక్షన్ సీన్. అది చూస్తేనే నాకు అర్థం అయిపోయింది సినిమా ఎలా ఉండ బోతుంది అనేది. వెంటనే దేవి శ్రీ ప్రసాద్ నుండి ఎంత మ్యూజిక్ చేయించుకోగలరు అంత చేయించుకోండి అని అన్నాను.

## మా ఇద్దరి మధ్య అంత బాండింగ్

### హీరోయిన్ శ్రీలీల



నాకు ఈ రోజు ఇక్కడ నిలబడి మాట్లాడటం ఎంత సంతోషకరంగా ఉంది. పుష్ప సినిమాలో నాకు అవకాశం ఇచ్చి నందుకు చిత్ర బృందానికి నా ధన్యవాదాలు. సాధారణంగా ఒక సినిమాలో ఇద్దరు హీరోలు పనిచేస్తుంటే అందరూ వారిద్దరూ అతలాకుతలం అయిపో తారనుకుంటారు. కానీ రష్మిక, నన్ను చూసి మిగతా వారంతా సెట్స్ లో అతలాకుతలం అయిపోయారు. మా ఇద్దరి మధ్య అంత మంచి బాండింగ్ ఉండటం సంతోషకరం.

## నీ కోసం ఏమైనా చేసేయొచ్చు

### డైరెక్టర్ సుకుమార్



నీ మీద ప్రేమతోనే ఈ సినిమా నేను తీశాను. నీతో ఈ సినిమా గురించి మాట్లాడినప్పుడు నా దగ్గర పూర్తి కథ లేదు. నువ్వు నన్ను నమ్మి నాతో ప్రయాణం చేసి నందుకు నీకోసం నేను ఏమైనా చేసేయొచ్చు అనిపించింది. మిగతావారు అంతా చెప్పినట్లు బన్నీ సెట్స్ లో అందర్నీ కలిపి ఒక స్థాయిలోకి తీసుకుని వెళ్లి కూర్చొబెడతాడు. దానితో అందరికీ అదే స్థాయిలో పనిచేయాలని అని పిస్తుంది.

Printed, Published by Mohammed Murthuza. Printed at Vivek art printers APHP SHOP NO.12, OSMANIA UNVERSITY ROAD,HYDERABAD. PUBLISHED ROOM NO.10,GROUND FLOUR budha bhavan m.g.road secundrabad 03. Ali publicacstion Hyderabad, www.samayam.net.
Mobile no. 98660 19778, 89789 60131.